# Telugu Jyothi తెలుగు జ్యోతి

A Literary Magazine from
The Telugu Fine Arts Society

తెలుగు కళా సమితి వారి
సారస్వత పత్రిక

http://www. tfasnj.org http://www.TeluguJyothi.com July-August 2014




# DENTISTRY FOR THE ENTIRE FAMILY

Member of ADA, NJDA & AEGD

## DENTAL ILLUMINATIONS

### Madhavi V. Kadiyala DDS & Associates

### General and Cosmetic Dentistry

- Digital Radiography X-Ray with Less Radiation
- Oral Hygiene, Sealants. Fluoride
- Bonding, Porcelain Veneers & Lumineers
- Teeth Whitening
- Periodontal Treatment
- One Visit Root Canals
- Metal Filling Replaced with White Restorations
- Surgical & Non Surgical Extractions
- Porcelain Crowns, Bridges & Complete Dentures

**Walk-ins & New Patients Welcome Most Insurance Plans Accepted**

**Please Call For Appointments at Two Convenient Locations**

660 Princeton Meadows
Shopping Center, **609-275-9688**
Plainsboro Road
**Plainsboro, NJ 08536**

Hopewell Crossing
800 K Denow Road **609-303-0571**
(Next to Stop & Shop)
**Pennington, NJ 08534**

## PLAINSBORO PRINCETON MEDICAL ASSOC.

**Dr. Aruna Chakrala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Sureka Reddy, MD**
BOARD CERTIFIED FAMILY MEDICINE

**Dr. Sangeeta Buddala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Pramila Veera Swamy, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

***OPEN 7 DAYS A WEEK!***

Blood Draws • 2D Echo Cardiograms • EKG • All Immunization Including Travel Vaccines • Minor Skin Procedures Including Wart Removals, ***LASER SERVICES,*** Dietician, Diabetic Management, Joint Injections, Pap Smears

666 Plainsboro Road, Suite 1020 • Plainsboro, NJ 08536

***CALL TODAY 609-799-5000***

**OFFICE HOURS: MON-FRI 8AM-8PM, SAT & SUN 8AM-2PM**
**LANGUAGES: ENGLISH, TELUGU, HINDI, MARATHI, SPANISH**
**AGE GROUPS : 8 YEARS & ABOVE**

# తెలుగు కళా సమితి

**The Telugu Fine Arts Society, Inc**

(A tax exempt and not for profit corporation)

*54 Erie Ave, Rockaway, NJ 07866*

# తెలుగు జ్యోతి

సంపుటి: 31 సంచిక: 4

జులై – ఆగస్టు 2014



**Editor: Diwakar Peri**, *Phone (732) 329-3464*

*Mail articles to: 29 Yorktown Road, Monmouth Jn. NJ 08852 or diwakar.peri@gmail.com*



**Associate Editors:** **Anantha Sudhaker Uppala** *Production Support*; **Radha Kasinadhuni** *- Essays & Community News;* **Syamaladevi Dasika** *- Stories;* **Dr. Vaidehi Sasidhar** *– Poems.*

**Madhu Anna** *and* **Guru Alampalli** *representing TFAS Board of Trustees.*

**Board of Trustees**
**April 2014 – March 2016**

**President**
***Srini Gandi***
*208 Margaret Ct, South Plainfield, NJ 07080*
*(732) 221-8017*
*president@tfas.net*

**Vice-President**
***Guru Alampalli***
*23 Harold Ave*
*Edison, NJ08820*
*(732) 277-8870*
*vicepresident@tfas.net*

**Secretary**
***Uma Makam***
*13 Alexis Lane,*
*Edison, NJ 08820*
*(732) 983-1936*
*secretary@tfas.net*

**Treasurer**
***Vasant Naidu Tanna***
*287 Pinelli Drive*
*Piscataway, NJ 08854*
*(732) 319-8155*
*treasurer@tfas.net*

**Annual Events**
***Sreedevi Jagarlamudi***
*(732) 470-7055*
*events@tfas.net*

**Youth Services**
***Bindu Madiraju***
*(732) 609-1836*
*youth@tfas.net*

**Membership Services**
***Vamsi Koppuravuri***
*1 Newburgh Drive,*
*Edison, NJ - 08820*
*(732) 429-4421*
*membership@tfas.net*

**IT Services**
***Madhu Rachakulla***
*(913) 220-9172*
*info@tfas.net*

**Community Affairs**
***Madhu Anna***
*(201)674-5477*
*community@tfas.net*

**Advisors**
***Dr. Ramakrishna Seethala***
***Dr.Suneetha Kanumuri***
**Mr. Rohinikumar Vemula**

**Founder Editor:**
**Late Kidambi Raghunath**


## మా మాట

"రసోవై సః" అని ఆర్షధర్మం పరమేశ్వరుణ్ణి కీర్తిస్తుంది. రస స్వరూపుడైన పరమాత్మ నాదస్వరూపుడై కూడా భాసిస్తాడు. వాగ్రూపంలో ప్రస్ఫుటించే పరమేశ్వరదత్తమయిన నాదం రసాత్మకమయి, 'లలిత'మయమైన అర్థంతో సంయోగించి అందమయినకావ్యంగా రూపు దిద్దుకుంటుంది. దైనందిన జీవితంలో జరిగే సంఘటనల్లోకూడా మనం చూడలేని అర్థాల్ని కవి చూడగలడు. అదే సాహిత్యం గొప్పతనం. 2009 లో ప్రారంభమయిన సాహితీ సమూహం ఇకపై "సాహిత్య భారతి"గా వ్యవహరింపబడుతుంది. "మన పాట-మనమాట–మనపద్యం" మకుటాయమానంగా ఇకపై ముందుకు సాగుతుంది. మన సంస్కృతి మన పూర్వీకులు మనకందించిన నడవడిని ప్రతిఫలిస్తే , మన ఆచారాలు వాళ్ళు మనకందించిన జీవనశైలికి అద్దం పడతాయి. తరతరాలుగా మన సంస్కృతి ఏమీమారకపోయినా మనం "ఆచరించే" ఆచారాలు దేశ-కాల-మాన పరిస్థితుల్ని బట్టి మారుతూవస్తున్నాయి. మన తెలుగుపెళ్ళిళ్ళలో వేద నిర్దేశితమయిన విధివిధానాలు మారకపోయినా ఆచారాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. వాటిని గూర్చిన "ఆహ్లాద'కర రచన "తెలుగు పెళ్లి కథ". మనదేశంలో పల్లెటూళ్ళలో వైద్య సౌకర్యాలు, ఆ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్ల పాట్లు హాస్యస్ఫోరకంగా చెప్పిన కథ డా. గిరిజా శంకర్ గారి రచన. ఇది తొంభయ్యవ దశకంలో జరిగినకథ అయినా ఈనాటికీ పరిస్థితుల్లో పెద్దమార్పులు లేవు. సూపర్-స్పెషాలిటి ఆసుపత్రులు పెద్ద పట్టణాలకే పరిమితమవుతున్నాయి. మన పల్లెటూళ్ళలో పేదా సాదా అరకొర సౌకర్యాలతోనే జీవితం గడుపుతున్నారు. భవిష్యత్తులో ఈ పరిస్థితి మారుతుందని ఆశిద్దాం. ప్రవాస జీవితాల్లో సంక్లిష్టత వైవాహిక జీవితాలని కూడా తాకుతోంది. "సఖ్యం సాప్తపదీనం" అంటూ ఏడడుగులు నడిచిన జంటలు, పరస్పర అవగాహనారాహిత్యంతో, అర్థంలేని పంతాలతో జీవితాల్ని ఎల్లా నాశనం చేసుకుంటున్నారో వివరించే కథ కొమరవోలు సరోజ గారి రచన. తెలుగు జ్యోతికి రచనలు కావాలి. ముఖ్యం గా మన యువతరం నుంచి, రిటైర్ మెంట్ ఆస్వాదిస్తున్న మన సీనియర్ తరంనుంచి. ఈ రెండు తరాలకీ తెలుగు వ్రాయడం సమస్యకావచ్చు. ఒకళ్ళకి రాక , ఇంకొకళ్ళకి అలవాటులేక. అందుకే ఈ రచనలు ఇంగ్లీషులో కూడా ఉండచ్చు. మన తెలుగు కళా సమితి యువ జన విభాగం ఈ బాధ్యత తీసుకుంటే బాగుంటుంది. అనుభవజ్ఞుల సలహాలు మన యువతరానికి శ్రేయోదాయకం. దయచేసి ఈ విషయంలో కొంత ఆలోచన చేయండి. వేసవి ఇంక కొద్ది రోజుల్లో ఆఖరవుతుంది. ప్రకృతి వర్ణమయమవుతుంది. ఆ తరవాత ... ఇప్పణ్ణుంచీ ఆ గోడవెందుకులెండి. తె.క.స పిక్నిక్ ఫోటోలు, విశేషాలు ఆన్-లైన్ మాగజైన్ లో చూడండి. వినాయక చవితి శుభాకాంక్షలతో ...

భవదీయుడు - దివాకర్ పేరి

## విషయసూచిక


| | |
|---|---|
| మామాట | 3 |
| TFAS President's Message | 5 |
| TFAS current event Accounts | 5 |
| లలితగీత వికాసం డా. వడ్డేపల్లి కృష్ణ | 6 |
| తెలుగు పెళ్ళికథ శ్రీమతి కాశీనాధుని రాధ | 13 |
| న్యూజీలాండ్ లో అజ్ఞాతవాసం డా. గి రిజా శంకర్ | 21 |
| నయా "గారం" శ్రీమతి అనుపమ గుళ్ళపల్లి | 32 |
| నిప్పు రవ్వలు శ్రీమతి కొమరవోలు సరోజ | 34 |
| సాహిత్య భారతి | 37 |
| పునశ్చరణం–సమీక్ష యదుకుల భూషణ్ | 37 |
| పునశ్చరణం డా. వైదేహి శశిధర్ | 38 |


కవర్ పేజీ: **" గణపతి " ఆర్టిస్ట్ : శ్రీ తురగా చలం**


*The articles published and the views expressed are those of the authors and not necessarily reflect the opinions of the editors or TFAS.*



Stephen R. Shapiro, MD



Lawrence S. Kluger, MD



Jeffrey S. Unger, MD



Surya P. Irakam MD
FACP, FACG



Robert S. Wiesen, MD

# Gastromed Healthcare, P.A.

Excellence in Gastroenterology

## PREVENTION & TREATMENT OF DIGESTIVE DISEASES:

- Abdominal Pain Evaluation
- Acid Reflux & Ulcer Treatment
- Liver Disease Treatment & Evaluating
- Colon Cancer Screening
- Gastrointestinal Bleeding Management
- Hemorrhoid & Fissure Treatment
- Irritable Bowel Syndrome
- Ulcerative Colitis & Crohn's Disease
- Gallstones & Gall Bladder Disease
- Pancreatic Diseases

**www.gastromedhealthcare.com**

**Gastromed@aol.com**

286 East Main Street, Somerville, NJ
(908) 231-1999

515 Church Street, Bound Brook, NJ
(732) 356-0420

203 Towne Center Dr., Hillsborough, NJ
(908) 359-1639

1140 Stelton Rd., Suite 101, Piscataway, NJ
(732) 339-8810



Dear Friends and TFAS Members, తెలుగు కళా సమితి సభ్యులందరికీ నమస్కారములు.

Hope everyone had a great summer! It has been 4-5 months since new TFAS executive committee took over during our 2014-Ugadi function in April. Since then, we organized two events – Dr. Shobharaju's musical workshop with over 60+ children and adults participating in the workshop followed by a concert on July 19th, and a summer picnic on August 3rd 2014. There was a big turnout for both the events. Thank you so much for your support. Please enjoy the pictures published on this magazine and also on our TFAS website/ TFAS's Picasa web album. Please share your feedback on these events so that we continue to improve the way we conduct community events.

As I mentioned previously, it has been 30 years since TFAS was introduced. We are planning big to celebrate our 30th Anniversary. Initially we thought of conducting this event in October of 2014 along with our Deepawali celebrations. However, based on your feedback – considering other various events and the timelines, we deferred this big event to Memorial Day of next year, May 2015. Thank you for your feedback and support on this. Please share your ideas for the event. Exact details of the event will be communicated to you during the next months through our website and email.

Apart from the events that we regularly conduct, TFAS committee is working hard on finalizing by-laws improvements, website enhancements, membership benefits, and other events that involve local talent. We have been receiving feedback to work on community services, and other activities involving youth and senior citizens. We will work on supporting these ideas. Thank you again for your feedback.

Finally, our Deepawali event is planned for October 18th at East Brunswick Middle School. We are planning on competitions for the event in various activities including music, dance and sports. Please register for the event and participate in competitions! I hope to see you all and thank you for your continued support to our team in serving you and the organization! Happy Deepawali greetings to all!

On behalf of entire TFAS executive committee, once again I thank you for your continued support to TFAS!

Sincerely,

Srini Gandi – President TFAS (president@tfas.net)

## Recent Event accounts

Treasurer, TFAS

*2014 Dr. Shobha Raju workshop and Concert Accounts*

*Donations*
*Workshop Donations: $4400*
*Concert Donations: $5190*
*Total Donations: $9,590*

*Expenses:*
*Artists Tickets: $966*
*Venue rentals: $650 (concert + workshop)*
*Audio rental: $500,*
*Certificates and Plaque: $250.39*
*printers costs: 221*
*Total expenses: 2,587.39*
*Artists remuneration : 7,000*

*Total Expenses: 9587.39*

*profit: 2.61*

*2014 Picnic Accounts*

*Donations at the Park: $1235 (Raffles + Donations)*

*Picnic Expenses:*
*Park Permit: $400*
*Flyers and posters: $90*
*Picnic Supplies: $218*
*Gifts for kids: $300*
*Food: $450*
*Tent, Generator and chair rentals: $310*

*Total Expenses: $1768*
*Net Loss: ($533)*
*contacting few companies to donate for Picnic to cover the Loss.*

తెలుగు జ్యోతి ప్రకటనదారులను ప్రోత్సహించండి ! ఆర్థిక పరిపుష్టి కి సహకరించండి !!

# లలితగీత వికాసం

డా. వడ్డేపల్లి కృష్ణ

**అడవి బాపిరాజు (1895 -1952)** : కవికొండల తరవాత గేప గేయాలు అధికంగా రచించిన కవి అడవి బాపిరాజు. వీరి తొలకరి, గోధూళి సంపుటాలు అందుకు నిదర్శనాలు. ఇతడు నవలాకారుడు, చిత్రకారుడు కూడా కావడం విశేషం.

గౌళ సెల్లాయి కూతురు = 3 + 5 + 4 = 12
బలె సక్కందని సూతురు = 2 + 6 + 4 = 12
దాని కళ్ళు నీలి పూలు = 3 + 3 + 3+ 3 = 12
దాని పళ్ళు జాజి పూలు = 3 + 3 + 3+ 3 = 12
దాన్ని పలకరిస్తే ఒళ్ళు = 3 + 3 + 4 + 3 = 12
మోహాన గగురు పొళ్లు = 5 + 3 + 3 = 12 || గౌళ్ళ||

బాపిరాజు ఒక గౌండ్ల చెల్లాయి కూతురు అందాన్ని, అందరూ చూసి ఎంత వింతగ చెప్పుకుంటారో చక్కగా వివరించారు. చెల్లాయి కూతురు కోడలు వరుసవుతుంది. అంటే మామ కోడలుకు శృంగార భావన సవ్యంగానే సరిపోతుంది. నల్లని కళ్ళను నీలి పూలని, తెల్లని పళ్ళని జాజి పూలని చెప్పడం మనోహరంగా ఉంది. దాన్ని పలకరిస్తే ఒళ్ళు మోహంతో గగర్పాటు కలుగుతుందనడానికి 'గగురు పొళ్లు' అని చక్కని గ్రామ్యం ప్రయోగించారు. వయస్సులో ఉన్న పడుచునే గాకుండా వరద గోదావరిని కూడా చాలా సహజంగా కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

ఉప్పొంగి పోయింది గోదావరి, తాను
తెప్పున్న యెగిసింది గోదావరి
కొండల్లో ఉరికింది.
కోనల్లు నిండింది
ఆకాశ గంగతో
హస్తాలు కలిపింది ||ఉప్పొంగి||

గోదావరి వరద తీవ్ర స్థాయిని సూచించడానికి ఆకాశగంగతో హస్తాలు కలిపిందన్నారు. ఆకాశగంగతో హస్తాలు కలిపేంత ఎత్తులో ఉప్పొంగి వచ్చింది కాబట్టే

అడవీ చెట్లన్నీని – జడలలో తురిమింది
ఊళ్ళు దండలుగ గుచ్చి – మెల్లోన తాల్చింది

మొదట తీవ్రస్థాయిలో కాళికలా ఊళ్ళను ఊడ్చి పెట్టినా, ఆ తరవాత వరద తగ్గుముఖం పట్టాక అంబికలా అనురాగంతో

శంఖాలు పూరించి – కిన్నెర్లు మీటించి
శంకరాభరణ రాగాలాప కంఠియై
...
కరమెత్తి దీవించి కడలికే నడిచింది.

అని సాగరసంగమస్థితిని సాక్షాత్కరింప చేశారు. బాపిరాజు గ్రామ్యంలో జానపద బాణీల్లో 'తొలకరి' , 'గోధూళి' కృతులను రచించినట్లే గ్రాంధికంలో 'శశికళ'ను రూపొందించారు. కృష్ణశాస్త్రి 'ఊర్వశి'లా, నండూరి 'ఎంకి'లా, బాపిరాజు వలపుల కల 'శశికళ' అని చెప్పవచ్చు. ఆమె సూర్యసుత – చంద్రబాల, గాన శిల్పాది త్ర కళా మూర్తి. ఎంకి పాటలలాగే 'శశికళ'లో ఏ గీతానికాగీతం స్వతంత్రంగా నడిచినా ఒకే పాత్ర చుట్టూ అల్లుకున్నవి, ప్రణయ గంధాలను చల్లుకున్నాయి.

కావ్యనాయిక నాకు శశికళ!
కావ్య రసమున స్థాయి శశికళ!
కావ్య వ్యంగ్యము రీతి శశికళ!
కావ్యమే నా గీతి శశికళ!

శశికళ తన కావ్య నాయికయే గాక, కావ్య రసానికే స్థాయి అనడం శశికళ గీతియే కావ్యమనడం సవ్యంగా ఉంది.

వెన్నెలలో వెలుగు ధార
వన్నెలలో స్నానమాడ
ధవళ కాంత తరళమూర్తి
భువన సకల మోహమూర్తి
ప్రణయ దేవి నా శశికళ
మృణాలాంగి నా శశికళ
పూర్ణ నగ్నయై నిలిచెను
పూర్ణ కుంతలా లాడగ

'నగ్న' గీతంలో తన శశికళను భువనైక మోహన మూర్తిగా, మృణాలాంగిగా, విరబోసుకున్న శిరోజాలు వెన్నెల వెలుగుల్లో కదలాడగా, పూర్ణనగ్నగా అగుపించినట్లు భావించారు. తన శశికళ పాడి




TFAS Shobha Raju Concert 2014



TFAS Picnic 2014

తే ఎలుగెత్తి ఆ పాట మాధుర్యాలలో ప్రాణాలు మరుగునని ఎనలేని అనురాగంతో రాగాలాపన చేశారు.

'శ్రుతిలేని గీతం'లో

పాడకే నా రాణి

పాడకే పాట

పాట మాధుర్యాల

ప్రాణాలు మరిగెనే!

రాగమాలాపించి

వాగులా ప్రవహించి

సుడి చుట్టు గీతాల

సురిగి పోనీయకే

కల్హార ముకుళములు

కదిలినవి పెదవులూ

ప్రణయ పద మంత్రాల

బంధించె జీవనము ..

శ్రుతి లేని నా మదికి

చతుర గీతాలేల? ... అంటూ తన శశికళ రాగ ప్రవాహంలో కొట్టుకు పోతానని వివరించారు. అంతే గాక 'లేపాక్షి" లోని మహోన్నతమైన బసవయ్యను చైతన్యంతో లేచి రమ్మంటూ అల్లిన ప్రబోధ గీతం అద్భుతంగా అగుపిస్తుంది.

లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా!

కైలాస శిఖరిలా కదలి రావయ్యా!

హుంకరించిన దెసలు ఊగిపోయేనూ

ఖురముతో దువ్వితే కులగిరులు వణికేను ||లే||

నువ్వు నడిచిన భూమి నూరు పంటల చేలు

ముట్టె ముట్టిన పొదలు మొలకెత్తు ఓషధులు

పెనుగొండ సీమలో వంగోలు భూమిలో

నీ వంశమీ నాడు నిలిచింది గర్వాన ||లే||

కైలాస శిఖరంలా కదలి రమ్మంటూ, నంది నడిచిన చోటంతా పంట సిరులేనంటూ ఖండ గతిలో బసవయ్య అఖండ కీర్తి పొగడినారీ గీతంలో. ఎత్తు అయిన బలిష్టమైన గిత్తలకు ఒంగోలు ప్రసిద్ధ కాబట్టి ఆఖరు పంక్తుల్లో ఆ ప్రస్తావన తెచ్చారీ గీతంలో. అయితే అడవి బాపిరాజు గారి గీతాలలో పల్లవులే తప్ప చరణాలు ప్రతిభావంతంగా అగుపించవని, నవల – కథలలోని సంపూర్ణ శిల్పం గీతాల్లో పాక్షికంగానే గోచరిస్తుందని డా. శ్రీ పాద గోపాల కృష్ణమూర్తి గారు అభిప్రాయ పడ్డారు.

**లలిత గీత విస్తారం (బాలాంత్రపు రజనీకాంతరావు) :**

బాలాంత్రపు రజనీకాంతరావుగారు లలితగీత ప్రక్రియా విస్తారకులలో ప్రముఖులు. ఆకాశవాణి ద్వారా అనేక లలిత గీతాలను స్వయంగా రచించి, కృష్ణశాస్త్రి, బసవరాజు మొదలైన కవుల పాటలకు కమనీయ స్వరాలను సమకూర్చి ప్రసారయోగం కల్పించారు.

ఆలయమున వినబడునదిగో

ఆకాశమున కనబడునదిగో

నవవర్షపు ఘంటానినాదం ||పా||

నవ్యాశాజ్యోతి!

ప్రాత యేటి పెను తమస్సులు

పాప కలితములు మనస్సులు పటాపంచలే!

చలనరహితంగా ఏటిలో నిలిచిన పాతనీటిని పోతదలించడానికి జల్లుగా పడే వాననీటిలా పెనుచీకట్లలో పాప పంకిలమైన మనస్సులను కడిగేయడానికి భగవంతునికరుణ జలధారగా కురిసి, లోకమంతా నవ్వుల నవ వసంతాలుచిందించే శుభోదయాన్నిస్తుందని, అప్పుడు అందరూ ఏకకంఠం తో 'ప్రభూ' అని మధుర స్వరంతో భగవంతుణ్ణి ప్రార్థించాలంటూ ప్రబోధించారు. రవీంద్రుని భక్తి,భావ,ఏకేశ్వరోపాసన మార్గాల్లో కృష్ణశాస్త్రిలా రజనీ గారు కూడా స్వరమెత్తారు. తెలుగు తల్లి అనే గేయం లో (పుట. 7,8 ) తెలుగుతల్లి కీర్తిని శ్రావ్యంగా శ్లాఘించారు.

పసిడి మెరుంగుల తళతళలు

మిసిమి వెలుంగుల

గౌతమి కృష్ణల గలగలలు

గుడి జేగంటల గణగణలు

మెరసి మొరసి మించిన

శుభ సమయము తల్లీ!

అని తెలుగు నేల పై ప్రవహించే నదుల గల గలలు, గుడి గంటల గణగణలు, కవి కోకిలల మధుర గానాలు, నెమలి క్రేంకారాల వంటి గాయకుల స్వరాలు తెలుగుతల్లి కీర్తిని నర్తింప చేస్తున్నాయని, ఆ తెలుగుతల్లికి స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రత్యేక రాష్ట్రం సిద్ధించే సమ




# LAW OFFICES OF JANETHA R. KANCHARLA

## SERVICES AVAILABLE

- Business Immigration
- Family Based Immigration
- Consular Processing
- Immigrant Visas
- Non-Immigrant Visas
- Naturalization

## IMMIGRATION SOLUTIONS THAT WORK FOR YOU.

The Law Offices of Janetha R. Kancharla is located in Herndon Virginia / Washington DC. Firm handles a variety of immigration matters, including employment and family based cases, as well as the areas of adjustment of status and naturalization.

The mission of the Law Offices of Janetha R. Kancharla is to continue to provide our clients with the highest level of personal and professional service for their Immigration needs. Please contact us to discuss any specific situation to see how we may be able to assist in reaching a resolution.

AILA



13800 COPPERMINE RD, SUITE # 177, HERNDON, VA 20171
PHONE: (703) 880-6409

EMAIL: JANETHA@JANETHALAW.COM

WWW.JANETHALAW.COM

యమాసన్నమైందని రజనీగారు రమ్యంగా రచించారు. ఇదే గీతి భావానికి అనుగుణంగా తరవాత కాలంలో కృష్ణశాస్త్రి గారు 'అమెరికా అమ్మాయి' చిత్రంలో –

పాడనా తెలుగు పాట

మీ ఎదుట మీ పాట

కోవెల గంటల గణగణలు

గోదావరి తరగల గలగలలు – అని రచించినట్లు తోస్తోంది. 'శతపత్ర సుందరి' అనే గేయంలో (పు.9 ) ఉదయసంధ్యలో సువాసనలు వెదజల్లుతూ రేకులు విప్పారిన 'శతపత్ర సుందరి' అనే పద్మం అందాలను అందంగా వర్ణించారు.

'శతపత్ర సుందరీ ! ఓహో శతపత్ర సుందరీ!

సురభిళ భ్రాంతిలో

సుందర నయనదళ కాంతిలో

ఈ ఉదయ సంధ్యవేళ మెరిసెలే

ఈ ఉదయ సంధ్యవేళ

నాహృదయ భావవేల విరిసెలే

నాహృదయ భావవేల

నీ మధువు మధుకరాళి మరగెలే!

నీ మధువు మధుక రాళి!

నీ వలపు లినకరాళి కరాగెలే!

నీ వలపులినక రాళి!

శతపత్ర సుందరీ !

ఓహో శతపత్ర సుందరీ!

అని సాగిన ఈ గేయం ముందుగా కూర్చుకున్న బాణీకి రచించినట్లుగా తోస్తోంది. 'దివ్యజ్యోతి'నాటక గీతాల సంపుటిలో చెప్పుకోదగ్గది. 'ఒక్కడవే' అనే గేయం (పుట:142) రవీంద్రుడి 'ఏక్ లా ఛలో' అన్న గీతానికి అనువాదమిది. సమాజం తోడు రాక పోయినా, గొంతు కలుపక పోయినా ఒక్కడివే ఎలుగెత్తి చాటమంటాడు కవి. మనిసి తాను ఎంతటి దైన్యం తో ఉన్నా ధైర్యాన్ని కోల్పోక, 'ఎవరూ కేక విని రాకపోయినా సరే ఒకటివె పదవోయ్' అని ప్రబోధించిన గీతమిది .

ఒకరయినా నీ కేకకు ఓయని రాకున్నా

ఒక్కడవే బయలుదేరు

ఒక్కడవే బయలుదేరు

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే బయలుదేరు ||ఒ ||

అంటూ చుట్టూ ఆవరించిన అజ్ఞానపుటంధకారాలను చీల్చుకుంటూ ఒంటరిగా ధైర్యోత్సాహంతో ముందుకు సాగిపొమ్మని ఉత్తేజపరిచారు.

మనసు విప్పి లోలోపలి

మర్మమేదో కంఠమెత్తి

నీకు నీవె చెప్పవోయి!

పిడుగు మంట కాల్పులోన

పడి మండే నీ గుండెల

ఒంటిగానె వెలుగనీయి!

అంటూ త్రిశ్రగతిలో రవీంద్రుని భావాల్ని ఎంతో రమ్యంగా ఆంధ్రీకరించారు. 'శరత్పత్రావళి ' ఖండికలో శారదాగమనం, శరత్కాల సంధ్యలు, స్వప్న జగత్తులోని స్నేహ మాధురులు, వలపు వినకనే జారిపోయిన అస్తమయాలు, గగన యానాలు,శతపత్ర సుందరికి మేలుకొలుపు లు, వెన్నెల రాత్రులు రమ్యంగా చోటుచేసుకున్నాయి. మొదట 'ఆగమనము' అనే గేయంలో (పుట :147)

చల్లటిగాలిలో యమునా తటిపై

శ్యామ సుందరుని మురళి

ఉల్లము కొల్లగొనే

మెల్ల మెల్ల చెవి సోకునపే

...

మురిసి మురిసి నా వెనుక దరిసి కను

మూయు చివరు కెంగేళు లివే!

అంటూ రాలిన వటపత్రాల మీద తెలిపడే అడుగుల గుర్తులు, పూతీగల చాటుగా కనిపించే శిఖిపింఛం, చెట్ల మాటునుంచి తనను గమనించే చిలిపి చూపులు, వెనుకనుంచి మెల్లగా వచ్చి కళ్ళు మూసే చేతులు ఇవన్నీ గోపాలుని రాకను తెలిపే విషయాలు. దూరాన మురళీగీతిక తో ఆకట్టుకొని, మెల్ల మెల్లగా చేరువవుతూ మైమరిపించే కృష్ణతత్వాన్ని గోపికా హృదయంతో వివరించారు. 'విభావరి' (పుట:148) అనే గేయంలో కదలే చీర చేరగులలాంటి స్వప్న సీమలో భయచ్ఛాయలు – సౌఖ్యభ్రాంతులు ఎందుకు? శాంతియుత వాతావరణం లో తరంగిణిలా – మత్తె

***Roopa Nampally - Coldwell Banker Broker Sales Associate***

**50 Princeton Hightstown Road**
**Princeton Junction 732-397-9185 (Cell)**
**Website: www.roopanampally.net**
**E-Mail: nroopa@comcast.net**

**Member of (Radha Cheerath Team).**



Buying or selling a home is one of the most important decisions you make in your life. Equally important is the right Real Estate Agent for that job.

You need a Real estate agent, like me, who has gone through formal training on an on-going basis and who will guide you through the many steps and decisions you make in the process of buying or selling a home.

Commitment to my job, superior negotiating skills, knowledge, easy accessibility, honesty, and hard work are very important to this job and those are my foremost qualities.

I will do my best to make your real estate experience as easy and as stress-free as possible.

## *Internal Medicine Group*

**Board Certified**
Dr. Arvind Doshi M.D.
Dr. Priti Mehta M.D.
Dr. Sujatha Muppala M.D.

Health is the only everlasting wealth. An ounce of Prevention is worth a pound of cure

- High Blood Pressure, Diabetes and High cholesterol are "Silent Killers" and tight control will prevent heart attacks and stroke
- Hospital affiliations with St. Peter Hospital, JFK Medical Center and Princeton Hospital
- Learn the Secrets of Nutrition to achieve desired Weight Loss
- Learn about all the Cardiovascular risk factors responsible for clogging the arteries

**Office Hours:**
Monday – Friday : 9.00 AM to 5.00 PM
Saturday : 9.00 AM to 2.00 PM

5 Stanworth Road
Kendall Park, NJ 08824
Phone: (732) 297-2343

906 Oak Tree Road, Suite K
South Plainfield, NJ 07080
Phone: (908) 822-2277

క్కిన కురంగిణిలా అలనగమనం – విలాస గమనం ఎందుకు? పరస్పర విరుద్ధ ఛాయల తో చల్లని చంద్రకాంత శిలామంటపంలో నిలిచి, యుగయుగాలుగా ఆగమ్యుడుగా ఉన్న ఎవరిని వలచి పరిభ్రమిస్తున్నా వాణి విభావరిని ప్రశ్నలతో పరామర్శించారు. 'సౌఖ్య రోచిర్లీల' వంటి చక్కటి పద ప్రయోగాలు చేశారు. ఇదే శ్రీశ్రీ '**కవితా ఓ కవితా**' లో రోచిర్నివహం గా, విప్లవ గేయంగా చిందులు వేయగా ఇందులో లాలిత్యం సౌఖ్య రోచిర్లీలగా లాస్యం చేసింది.

ఓ విభావరీ! ఓహో విభావరీ!
నీహార హార నీలంబర
ధారిణి! మనోహారిణి!
ధరణీతల చంద్రశిలా
తరళ మంటపమున నిలిచి
యుగములుగ పరిభ్రమింతు
వగమ్యుడౌ యెవని వలచి

ఓ విభావరీ! ఓహో విభావరీ! – అని వెన్నెల రేయిని కన్నుల పండువగా అభివర్ణించారు.

ఎవరోహో! ఎవరోహో!
ఇపుడా నను పిలిచేరు?

ఈగేయం కృష్ణశాస్త్రిగారి రచనాధోరణిని గుర్తు చేస్తుంది. దుష్ట సమాజానికి దూరంగా ఎక్కడికో మానసికంగా ఒంటరిగా వెళ్లిపోయిన తనను అక్కడ కూడా 'ఒంటిగా ఏడ్వనీరు నన్ను' అని కృష్ణ శాస్త్రి గారి కవితా పంక్తులను తలపింపచేస్తుంది. 'అన్నపూర్ణ' (పు:317) అనే గేయంలో అన్నపూర్ణగా , విశాలాక్షిగా విశ్వఖ్యాతి గాంచిన భారత రత్నగర్భలో ఆకలికేకలు, నిర్దయలు చోటు చేసుకున్నాయని, దేశసంపదనంతా దోపిడీదారాలు దోచుకు పోతున్నారని వాపోయారు.

స్వతంత్ర భారతి జననీ! నీకిదె
నితాంత నవ నీరాజనము
అశేష పూజా శిరీషములతో
అగణిత నరనారీజనము
...
వాడ వాడ నీ హృదిలో మేడల
నేడు త్రివర్ణ పతాకములే! ||స్వ||

దైన్యపు చీకట్లు చెల్లా చెదురయ్యాయని, హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు భారతఖండం ఒక్కటిగా ఆనందతరంగాలలో ఓలలాడిందని స్వతంత్ర భారతాన్ని కీర్తించారు. శౌర్యానికి జేగురు రంగు, శాంతికి తెలుపు రంగు,సస్యసంపదకు పచ్చని రంగు ప్రతీక గా సూచిస్తూ త్రివర్ణ పతాకం కర్మభూమికి గుర్తుగా చక్రాన్ని మధ్యలో ధరించిందని, ఏ వాడలో చూసినా, మేడలో చూసినా మువ్వన్నె జండాల రేపరేపలే సాక్షాత్కరించాయని తనివి దీరా ప్రస్తుతించారు. 'స్వాతంత్ర్య ఘంట' (పుట: 267) అనే గేయంలో –

స్వాతంత్ర్య శుభోదయ ఘంటా
నాదంబదె మ్రోగెను మింట
టంఠం – టంఠం - టంఠటం!
టంఠం – టంఠంఠం!

అని స్వాతంత్ర్య ఘంటారావాన్ని వినగానే కొత్త ఆశలు చిగురెత్తాయని, జనుల శిరస్సులు భారతి పాదాలపై కొరిగి మొక్కాయని, కరాలు మాతృదేవికి హారతులు పట్టాయని, విద్వేషాలు సమసి ప్రశాంత వదనాలతో భారతిని విలోకిస్తున్నారని, కీర్తి పతాకం ధర్మచక్రంతో రెపరెపలాడుతుందని, సత్యాహింసలె ఆయుధాలుగా స్వాతంత్ర్యాన్ని సాధించిన గాంధీని కన్నతల్లియగు భారతి కి స్వాగతం గా శుభోదయ ఘంట' నాదంగా మోగిందని, ఆ నాదాన్ని అడుగడుగునా 'టంఠం – టంఠం - టంఠటం' అంటూ శబ్ద రూపంగా చెవులకు వినిపింపచేసారు. రజనీ గారి దేశభక్తి




**AAA CHECKER**
**Airport taxi & Limo Service**
☎ **CALL (732) 486-5161; (732) 689-0161**
**WWW.AAACHECKER.COM**
**aaachecker@gmail.com**

# WE COULDN'T BE MORE EXCITED ABOUT THIS MESSAGE

# Yes, WE ARE GROWING

# Yes, WE ARE HIRING

Even in this economy

To Find Out How You Can Bring Your Career to **LIFE** Contact me Today



**Thevan Theivakumar**, CLF®

Sr. PARTNER, New Jersey Sales Office

**(732) 744-3763**

ntheivakuma@ft.newyorklife.com

**www.ThevanTheivakumar.com**

EOE.M/F/D/V

WE STAND STRONG | JOIN OUR TEAM | NEW YORK LIFE

The Company You Keep®

New York Life Insurance Company 399 Thornall Street, 7th Floor Edison, NJ 08837

గేయాలలోని 'స్వాతంత్ర్యోత్సవ పుష్పాంజలి' (పుట:371) ఆ రోజుల్లో దేశం నలుదిశలా టంగుటూరి సూర్యకుమారి గళంలో మారుమోగిన గేయం.

మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్ర జాతి!
భరత దేశమే మాదేశం
భారతీయులం మా ప్రజలం!
...
ఆలయమ్ముల శిల్ప విలాసం
ఆరామమ్ముల కళా ప్రకాశం
మొగల్ సమాధుల రసదరహాసం!
మాకు నిత్యనూతనేతిహాసం!!

అని వింధ్యాది పర్వతాల నడుమ ఎగిసే సంధ్యారుణిమలాంటి ఆశలు మావి, గంగాది నదులలాగా ఉత్తుంగ తరంగాలతో ఎగిసిపడే హృదయాలు మావి. ఆలయ శిల్ప కళా విలాసం, ఆరామాల ప్రకాశం, మొఘుల్ సమాధులు చెప్పే 'తాజ్ మహల్ ' లాంటి రస వత్తర చారిత్రకసత్యాలు మాకు నిత్యనూతన ఇతిహాసాలని 'అహింసా పరమో ధర్మ', 'సత్యం వద-ధర్మం చర' ఇత్యాది వేదోక్తులు ఎప్పటికి శిరోధార్యాలనీ, స్వతంత్రం, సౌభ్రాతృత్వం, సమత అనేవి మా సదాశయాలంటూ, అందుకే భారత భారతికి నివాళులర్పిస్తున్నామంటూ సంగీత సాహిత్యాన్ని సమంగా రంగరించారీ గేయంలో. గేయం మొత్తం చతురస్ర గతిలో చక్కగా నడిచింది. ఈ గీతం గ్రామఫోన్ రికార్డుగానే గాకుండా ఆకాశవాణిలోనూ అనేక సార్లు ప్రసారమై అఖిలాంధ్రుల మన్ననలందుకుంది. రజనీ గారి లలిత గేయాలు లలితగీత ప్రక్రియకు తగిన ప్రచారాన్ని, అనుకూల విస్తారాన్ని కలుగచేశాయి. (తరువాయి వచ్చే సంచికలో)

## తెలుగు పెళ్ళికథ

శ్రీమతి కాశీనాధుని రాధ , డోవర్, న్యూజెర్సీ

ఇదొక తెలుగు పెళ్లి కథ. ఏవమ్మా నీకు రోజూ కథలు చెప్పకపోతే తోచి చావదా? ఇప్పటికే బోలెడన్ని ప్రేమకథలు, పెళ్లి కథలూ అందరి దగ్గరా విని విసుగెత్తిపోయాం. మళ్ళీ మరో కథ మొదలు పెట్టావంటే మర్యాద దక్కదు ... అంటూ చివాట్లు పెట్టకండి. ఇది ఏ అమ్మాయి,అబ్బాయిల కథ కాదు. నిజంగా పెళ్లిని గురించిన కథ. మీరు కోప్పడనంటే ... కథ కాదు కథనం అంటే నిజానికి ఒక విషయం గురించి చెప్పడమే అని విన్నవించుకుంటున్నాను. కన్యాశుల్కం ఏనాడో పోయింది. వరవిక్రయం ముగిసినట్టే. (ఈ విషయంగా మీకు సందేహాలూ, కొశ్చెన్లూ ... ఉన్నట్లైతే అవి పబ్లిక్కుగా మాట్లాడుకునే విషయాలు కావు. మరి మరోచోట మాటాడుకుందాం.) ఇహపోతే, పైన చెప్పిన పెద్ద గొడవలు ఏవీ లేక పోయినా, ఏదో ఒక రకంగా విషయాల్ని కాంప్లికేట్ చేసుకుని పెళ్లి పేరిట హడావుడి పడటం మనకి బాగా అలవాటై పోయింది. పెళ్ళికి కావలసినవి – పెళ్ళికొడుకు,పెళ్లి కూతురు, కళ్యాణ మంటపం, శుభలేఖలు, నగలు,బట్టలు, భోజనం అంటే కాటరింగ్ వాళ్ళు, డెకరేషన్ వాళ్ళు, పెళ్లి చేసే బ్రాహ్మణులు, సన్నాయి మేళం, స్నేహితులు, చుట్టాలు–పక్కాలు. నిజం చెప్పొద్దూ .. ఈ 'పక్కాలు' ఎవరో నాకెప్పుడూ క్వశ్చెన్ మార్కే. హైదరాబాదు లాంటి ఊళ్ళో

**With Compliments from:**

Cosmic
Stone & Tile Distributors
475 Jersey Avenue, New Brunswick, NJ 08901
Tel: (732) 937 5400 Fax: (732) 937 6969 www.cosmicstone.com
**Wholesale distributors of:**
***Slabs & Tiles of granite, marble, onyx, crystal glass & engineered stone &***
***Tiles of polished or glazed porcelain, ceramic & concrete***

# KRISHNA TOURS & TRAVELS

*Latest Models for Comfort & Convenience*
*Manish Parikh*

**908-420-1784**

www.manishtaxiandlimo.com
*Safe and courteous drivers with over 10 years experience*
*All major credit cards accepted*



- *Airport Services to JFK, Newark, Laguardia Philadelphia and other airports*
- *Casino Trips to Atlantic City, NJ, Foxwoods and Mohegans, CT*
- *US and Canada sight seeing Tour Packages (includes Washington D.C., Hershey Park, PA. New York City, Niagara Falls etc)*
- *Weddings, Sweet 16, Social and Bachelor Parties group transportation.*

www.manishtaxiandlimo.com
manish@manishtaxiandlimo.com








# KRISHNA TOURS & TRAVELS

*Latest Models for Comfort & Convenience*
*Manish Parikh*

**908-420-1784**



ALL AIRPORTS AND CASINO TRIPS
SIGHT SEEING TOUR PACKAGE
FOR NEW YORK, WASHINGTON D.C.
NIAGARA FALLS
AND MANY OTHER DESTINATIONS
NEW YORK NIGHT LIFE
SWEET 16 & GIRLS/LADIES NIGHT OUT
SOCIAL & BACHELOR PARTIES

www.manishtaxiandlimo.com manish@manishtaxiandlimo.com

*Safe and courteous drivers with over 10 years experience*

ఉంటే, “పక్కనున్న వాళ్ళు “ పక్కాలు కారు.  వాళ్ళని పెళ్ళికి పిలవక్కర్లేదు.  ఎందుకంటే “ఓవరు హెడ్ టాంకు” లో నీళ్ల గురించి బిల్డింగులో ఉన్న వాళ్ళెవరికీ ఒకరంటే ఒకరికి పడదు.  పోనీ ఈ విషయం తరవాత చూసుకుందాం. మన అమెరికాలో అయితే కళ్యాణమంటపానికి బదులు ఫైవ్ స్టార్ హోటల్, సన్నాయి మేళానికి బదులు సి. డి లు అనుకోండి.  పెళ్లిలో ముఖ్యమైన తంతులు – ఎదుర్కోలు, శుభలేఖార్ధాలు చదవటం, స్నాతకం, కాశీయాత్ర, గౌరీ పూజ,పెళ్లి (జీలకర్రబెల్లం పెట్టడం, మంగళ సూత్రధారణ,తలంబ్రాలు వగైరాలు) నాగవల్లి, స్థాళీపాకం, భోజనాలు, అటుతరవాత  అప్పగింతలు.  మా మామ్మ అంటూ ఉండేది “ **మారోజుల్లో పెళ్ళంటే ఐదు రోజులు**” అని.  ఆ రోజుల్లో ఆడవాళ్ళకే కాదు, బహుశా మగ వాళ్ళల్లో కూడా చాలామందికి ఉద్యోగాలూ గట్రా ఉండేవి కాదనుకుంటాను.  కాని క్రమేపి అంతా ఒకరోజులో ముగించి, అబ్బాయి ఊరెళ్ళి “రిసెప్షన్” చేసుకోవడం.  అటు తరువాత కొన్నేళ్ళకి  పెళ్లి అయిన సాయంకాలం రిసెప్షన్ చెయ్యడం మొదలెట్టారు.  ఆడపెళ్లి వారి మీదే ఆ ఖర్చు కూడా రుద్దడానికి ఒక సాకు అనుకుంటాను. ఇకపొతే  ఆఫీసులు కారణంగా పొద్దుట పెళ్ళికి రాలేక పోయిన సహోద్యోగులు, స్నేహితులు గట్రా వచ్చి కొత్త జంటకి అభినందనలు చెప్పి,  కానుకలు ఇచ్చుకోవడం దీని ముఖ్యోద్దేశం. సాధారణంగా పెళ్లి కి వెళ్ళి వచ్చామని తెలిస్తే, అందరు అడిగే ప్రశ్న ఒకటే “పెళ్లి విశేషాలు ఏవిటి?” అంటూ … ఈ మధ్య చూసే పెళ్లిళ్ళలో ఒకటా రెండా బోలెడన్ని విశేషాలు. ఎందుకంటే పూర్వం పెళ్ళిఅంటే ఒక ప్రోటోకాల్ ఉండేది.  మరి ఈ నాడో ఇవాళ వెళ్ళిన పెళ్ళికి, రేపు వెళ్ళబోయే పెళ్ళికి ఒకటో రెండో స్టెప్పులు ఎక్కువ అవుతాయి.  మీరు మీ నోట్స్ పారేసుకుంటే మరీ తికమక అయి కంగారు పడగలరు. ప్రతిపెళ్ళికి నోటు చేసుకోవలసిన పాయింట్లు, చెరిపెయ్యాల్సిన అంటే కొట్టివేసే య్యాల్సిన పాయింట్లు, ఎన్నో ఉంటాయి. ముందుగా ఓ ఎనిమిదేళ్ళ కిందటి నాటి పెళ్ళితో మొదలెడదాం. మా అక్కయ్య కొడుకు పెళ్ళి.  మా ఇంట్లో, సెకండ్ జెనరేషన్ లో మొదటిది.  మా అక్క  కాస్త అమాయకురాలు, ఆడ పెళ్ళి వారు కాస్త పాత రుచులు కలవాళ్ళు కావటంతో గమనించదగ్గ మార్పులు లేకుండానే కార్యక్రమం జరిగిపోయింది. అక్కడినుంచి చూసిన పెళ్ళిళ్ళన్నిట్లో నా నోట్స్ నిండా, బోలెడన్ని అడిషన్సూ, అప్ డేట్లూనూ.

మరో మూడేళ్ళ తరవాత  జరిగిన పెళ్ళిలో… ముందు రోజున ఎదుర్కోలూ గట్రా అయ్యాక, అమ్మాయి, అబ్బాయి చక్కగా


This Page is sponsored by Pediatric and adolescent Care Associates

Pediatric and Adolescent Care Associates

**Ravi S. Chennapragada, MD, FAAP**

*Board Certified in Pediatrics*
*Experienced and individualized care*

Daytime, evening, or weekend appointments available

*On call 24 hours a day, 7 days week for emergencies*
*Free pre-natal consultation*
*Most insurance plans accepted*

Attending pediatrician at:
*Robert Wood Johnson University Hospital ▪ St. Peter's Medical Center*
*JFK Medical Center ▪ Somerset Medical Center*

*▪ Two convenient locations ▪*

*676 Route 202-206 North, Building 2*
*Bridgewater, New Jersey*
*(908) 927-1155*

*1667 Oak Tree Road*
*Edison, New Jersey*
*(908) 927-1155*




# *Would you like to straighten your smile?*

## 5 Reasons why braces at our orthodontic practice is right for you

★ ***Ask Friends and Neighbors who they use or who they've heard is the best.***
We've earned our reputation in the community with over 25 years of more than satisfied parents and patients. We're confident that when you ask... our name will be the one they mention.

★ ***The Atmosphere is one that your child likes and you like.***
Ours is a friendly, family atmosphere (Check us out...Anytime)

★ ***The Doctor always communicates with the patient and parent.***
You always receive clear, consistent and understandable communication ... Every Visit!

★ ***Your needs are considered when scheduling and rescheduling appointments.***
We're open 5 days a week, and we have early AM (7am) and evening hours (until 9:00 p.m.) available weekly to accommodate your child's after school activities and/or your hectic schedule.

★ ***You receive assistance with insurance and payment plans.***
We offer in-house interest free budget plans and we can charge your credit card, debit card or flex card monthly for your convenience. We also participate with Care Credit.

We Are In-Network providers with: GUARDIAN UNITED CONCORDIA Horizon MetLife Aetna CIGNA
**and many more**

Sterritt, D'Avanzo, Vives
RARITAN VALLEY Orthodontics

Somerville/Bridgewater
Branchburg
901 U.S. Hwy 202
Raritan, NJ 08869
908-231-1860
**www.fivestarorthodontics.com**

# $500 off Orthodontic Treatment

Must present this ad at consultation. Not valid with any other offer or prior services.
offer expires July 31, 2011

మేకప్పులు, ముస్తాబులు, చేసుకుని స్టేజి మీద కూర్చోగానే, మ్యూజిక్ పెట్టి, రిసెప్షన్ మొదలైందన్నారు. ఈ లోపున ఒక లావు పాటి నడివయసు ఆవిడ, ఒక సన్నపాటి కుర్రాడు, గాగ్రాచోలీ వేసు కున్న అమ్మాయి, ఇంకో బట్టతల పెద్దమనిషి, మరో నలుగురు చిన్నపిల్లలు, అక్కడ డి.జె. వేస్తున్న రికార్డులకి డాన్స్ మొద లెట్టారు. 'ఓహో తెలుగు దేశం అభ్యుదయ పథం కేసి నడుస్తోందే' అనుకున్నాను. అయినా, ఇలా పెళ్ళి, రిసెప్షన్ - ఆర్డరు మారి పోయి జరుగుతున్న ఈ హడావుడి అంతా చూసి, ఉండ బట్టలేక, వరసకి వదిన గారైన ఆవిడని పట్టుకుని, 'అదేవిటి పెళ్ళిరేపు ఉదయం కదా మరి రిసెప్షన్ ఇప్పుడు జరుగుతోందేమిటి?..' అంటూ, వెట్టి మొహం పెట్టుకుని అడిగేశాను. ఆవిడ అన్నమాటల ప్రకారం తేలిందేవిటంటే - మగ పెళ్ళివారు మర్నాడు సాయంకాలం ఊరికి వెళ్ళిపోతారుట, పై పెచ్చు ఊళ్ళో ఉన్న ఆడపెళ్ళి వారి తాలూకు స్నేహితులు, తెలిసినవాళ్ళు, నార్త్ ఇండియన్ పనీర్ మఖినిలూ, పావు బాజీలూ, సమోసా ఛాటులూ అంటే పడి చస్తారుట. మరి పెళ్ళిభోజనంలో ఇవన్నీ వడ్డిస్తే... 'అత్తిలి' నుంచి వచ్చిన మగపెళ్ళివారు ఏవనుకుంటారో అని, రెసెప్షన్ ముందు రోజు కానిచ్చేసుకుంటున్నారుట.

ఏదో మాటవరసకి వడ్డిస్తే ... అన్నాను గాని 'వడ్డనల'ని మనవాళ్ళు 'దుడ్డుకర్రల'తో చావగొట్టి తరిమివేసారంటే అదేమీ అతిశయోక్తి కాదు మరి. వెనకటికి వరవిక్రయంలో "పెళ్లికొడుకు మేనమామ భార్యకి వేలువిడిచిన మేనకోడలికి బొట్టు పెట్టి భోజనానికి పిలవలేదని అలిగి కూర్చుంది అందుకనే మగపెళ్లి వారు భోజనాలకి కదలలేదు" అన్న డైలాగు విని కడుపుబ్బ నవ్వుకున్నాం. కాని వియ్యాలవారికి, వచ్చిన చుట్టాలకి పక్కాలకి వడ్డనలు చెయ్యడం అదొక సరదాగా ఉండేది పూర్వపు రోజుల్లో. మరి ఈ నాడో 'బఫేలు' తప్ప 'భోజనాలు' పోయాయి. ఏ పెళ్ళికి వెళ్ళినా పెళ్లి జరుగుతూ ఉండగానే, ముఖ్యమైన అతిథులు భోజ నం చెయ్యకుండా వెళిపోతారేమోనని, పొద్దుట పదకొండున్నర నుంచి 'బఫే టేబుళ్లు' సర్దటం మొదలు పెడతారు. ఈ విషయాన్ని



ఆవులించకుండానే పేగులు లెక్కెట్టే 'టాలెంట్' ఉన్న ప్రజానీకం పసికట్టి పోలోమని లేచి వెళిపోతారు తినడానికి. మన బోటి వారు కదలకపోతే '**పద బఫే స్టార్ట్ చేసేసారు. తరవాత వెళితే జనంలో కొట్టుచావాలి**.' అంటూ రెక్క పుచ్చుకుని లాక్కుపోతారు మన శ్రేయోభిలాషులు. పైపెచ్చు అందరూ ఇది తమ ఒక్కరికే వచ్చిన 'బ్రైట్ ఐడియా' అనుకుంటారు అక్కడికి వెళ్ళేదాకా. తీరా అక్కడికి వెళితే చెయ్యి సలుపు పుట్టే అంత బరువున్న ప్లేట్లు తీసుకుని, లైనులో నిలబడ వలసిందే మరి.

మాయాబజార్ సినిమాలో ఘటోత్కచుడు వంటింట్లో చూసిన పెళ్లి భోజనం, దిగదుడిచి పడేసిన మూడు ముద్దల్లా కన బతుంది అక్కడున్న వరైటీ చూస్తే. నాలుగు కూరలు,రెండు పప్పులు, మూడు పచ్చళ్ళు, పులుసు,సాంబారు, రసం, పులి హోర, పూరీలు, మైసూరు బజ్జీలు, మిరపకాయ బజ్జీలు ....ఇలా సాగిపోతుంది వరస. హమ్మయ్య చివరికి వచ్చాం అని ఊపిరి పీల్చుకునే లోపల తెలుస్తుంది, మరో నాలుగు టేబుళ్ళ మీద నాన్, పాలక్-పనీర్, దాల్‌మఖానీ, నవరత్నకూర్మా, వెరైటీ బిర్యానీ లు, రైతాలు అంటూ ఇంకో చాంతాడు లాంటి ఐటమ్ లిస్టుని మనం కవర్ చెయ్యాలి అని తెలిసొస్తుంది. చెయ్యకపోతే మనశ్రేయోభిలా షులకి కోపం వచ్చెయ్యగలదు.

మళ్ళీ మళ్ళీ లైనులో నిలబడే ఓపిక లేక ఇంత తిండి ఉన్నా 'మాదాకబళం' (అసలు ఈ మాట 'మాతా కబళం" ఓ ముద్ద పడేయ్యమ్మా అని అర్థం) వాడిలాగ పళ్ళెం నిండా అర్థం పర్థం లేకుండా నింపుకున్న పదార్థాల రుచులు ఏమిటో తెలియకుండా తినేవాళ్ళే ఎక్కువ. అమెరికాలో లేబర్ ఖరీదు ఎక్కువ. అందుకని అంత మంది పనివాళ్ళని భరించడం మన వల్ల కాదు. మరి ఇండియాలో ఈ సంప్రదాయం ఎలా,ఎందుకు మొదలైందో తెలియదు. నా మటుకు నేను 'ఏఫిషి ఎంట్' గా పనులు చెయ్యడం దీని ముఖ్యోద్దేశం అనుకుంటాను. పూర్వం కూర్చోబెట్టి, కొసరి కొసరి ఆడపెళ్ళి వారు వడ్డిస్తుంటే తినే మన జాతి, ఈరోజున ఎగబడి, తోసుకుంటూ, కుమ్ముకుంటూ తిండికోసం పడిచచ్చే వాళ్ల కి మల్లె, పళ్ళెం పట్టుకు పోయి అవతల వడ్డించే యూనిఫారం లోఉన్న కుర్రాడు గరిటతో గిరవాటు వేసిన తిండి తెచ్చుకుని, నిలబడి తినవలసిన అవస్థను చేతులారా ఎందుకు కొనితెచ్చుకు న్నామో? అంటే పాత చాదస్తాలు వదలి, కొత్త పద్ధతులు వచ్చాయి అనుకోవాల్సిందే. ఓపదేళ్ళుగా వచ్చిన ఇంకో గొప్ప మార్పు(నోట్స్ లో రాసుకోవాల్సిన కొత్త స్టెప్పు) ఏవిటంటే.... ' ఐస్క్రీం ' అన్నది పెళ్ళి భోజనంలో ఒక భాగంగా, అనకాపల్లి నుంచి హైదరాబాదు దాకా జరిగే సమస్తమైన పెళ్ళిళ్ళలో వడ్డించే మహా '**పాపులర్ ఐటమ్**' అయిపోవడం – అన్నది. భోజనం కాగానే చెయ్యి తడి కూడా ఆరకుండానే – పిన్నా- పెద్దా, ఆడా-మగా,ముసలి-ముతక, పిల్ల-పాప,డయబెటిక్-నాన్ డయబెటిక్ ఆదిగాగల సమస్త జనమూ, ఎడారిలో ఒయాసిస్సుని చూసిన వాళ్ళలా, ఐస్క్రీం మొహం చూడని వాళ్ళలా పరుగులు పెడతారు. అప్పుడే తిన్న కమ్మటి భోజనం గురించి మర్చిపోయి, అట్ట కప్పుల్లో వడ్డించిన ఈ దివ్యపదార్థాన్ని, కర్రపుల్లతో తీసుకుని అమృతపానం చేస్తున్నంత మైమరపుతో తింటుంటారు. ఈ ఉపకధ ఇక్కడితో ఆగిందా?... అంటే లేదు. మరి కొంత కాలానికి ఈ విషయంలో.... మరో కొత్త డెవలప్ మెంటు వచ్చేసింది. పాశ్చాత్య సంప్రదాయాన్ని పాటిస్తూ, ఐస్క్రీమ్ మీద వేసుకోవడానికి రకరకాల అదనపు సామగ్రి కూడా (చాక్లెట్ చిప్స్, నట్స్, స్ప్రింకిల్స్ గట్రా) వచ్చేసింది. ఇక మనవళ్ళు మరియు మనవరాళ్ళు వాటి పేర్లను, గుణవిశేషాలను వివరిస్తుంటే, శ్రద్ధా భక్తులతో విని, ఒక నిర్ణయానికి రాలేక తికమక పడే వయసుమళ్ళిన వాళ్ళున్నారే... మహా ముచ్చటగా కనబడతారు. ఆనందంగా ఈ దృశ్యాన్ని చూస్తున్న మనకి, వెనకనుంచి '**ఒరే సీనూ! నిన్నేరా ! ఆ చేత్తోనే నాకో చాక్లెట్టు ఐస్క్రీం పట్రారా**' – అని ఓ మోకాళ్ళ నొప్పుల బామ్మగారు వేసిన గావు కేకతో స్పృహ వస్తుంది.

ఈ మధ్య కాలంలో పెళ్ళిళ్ళ లో చోటు చేసుకున్న మరో విశేషం 'డిజర్ట్ బుఫే' భోజనాలహాలులో ఆ చివర్నించి ఈ చివరి దాకా టేబుళ్ళ మీద తెలుపు లేదా ఎరుపు టేబుల్ క్లాతులు పరిచి, బూరెల దగ్గర్నుంచి బాసుంది దాకా ఓ పది రకాల స్వీట్లు, దాని పక్కనే పుల్లవి, నల్లవి, ఎర్రవి,తెల్లవి అయిన పండు ముక్కల్ని కప్పుల్లో వడ్డిస్తుంటారు. చెడిపోతూ చెడిపోతూ మధ్యలో కక్కుర్తి పడటం కూడా ఎందుకని, మా శ్రీవారి లాంటి వాళ్ళు కనబడిన స్వీటునల్లా, పళ్ళెం పట్టినంత మేరకు వడ్డించు కుని నడిచి పోతుంటే, పళ్ళ టేబుళ్ళ వాళ్ళు ఆపేస్తారు. **అవన్నీ**

**తింటున్నావు మరి వీటి సంగతేమిటి?** అంటూ... మొన్నోసారి – బోలెడుస్వీట్లు చూసిన పారవశ్యంలో స్వీటు హార్టుని మర్చిపోయి, తనివితీరా అన్నిరకాలు, ఒకసారి తినేసే ప్రయత్నంలో ఉన్న మా వారు, నేను తన వెనకే ఉన్నానన్న సంగతి మర్చి పోయి ... **"ఇంటి దగ్గర మా ఆవిడ '*వంటికి మంచిది పళ్ళు తినండి*' అని గొడవపెడుతుంది. స్వర్గానికోచ్చినా సవతి పోరేనా అన్నట్టు మీ గోడవేవిటి బాబూ**" అని మొత్తుకుంటే ... '**భలేవారండి బెర్రీలు,నల్ల ద్రాక్షా మన ఊళ్ళో దొర్కపోతే ఎక్కడినుంచో తెప్పించారండి కొంచం వేసుకోండి**' అని దబాయించి మరీ వడ్డించాడు ఒక ఆసామి. రెండుపళ్ళాలు చెరో చేతా పుచ్చుకునివచ్చి, టేబుల్ దగ్గర కూర్చున్నాక 'ఇనీ, మీనీ, మైనీ, మో..' అనుకుంటూ చివరికి స్వీట్లు మాత్రమే ఖాళీచేసి, "**నీకు ఫ్రూట్స్ ఇష్టంకదోయ్ ఇవి నువ్వు తీసుకో**" అని గడుసుగా ఆ పళ్ళ ముక్కల్ని నాకేసి తోసారు శ్రీవారు.

మరో సారి వెళ్ళినప్పుడు, పెళ్ళికూతుర్ని చేసిన రోజు సరదాగా ఉంటుందని 'మెహంది' పార్టీని ఉత్తరాది నుంచి అరువు తెచ్చుకున్నారు ఒక పెళ్లివారు. అక్కడ చేరిన ఆడవారంతా ఈ 'మెహంది' అనే మాటకి మన తెలుగులో 'గోరింటాకు' అన్న పేరుందనే సంగతే మర్చిపోయి... ఒకర్ని మించి ఒకరు సరదాపడుతూ వేలితో మొదలెట్టి మోచేతి దాకా ఆకులూ, చెట్లు,పూలు,మొగ్గలు మొదలైన రకరకాల డిజైనులతో 'మెహంది' పెట్టించుకున్నారు. గోరింటాకు పెట్టుకోవడం మనకీ సంప్రదాయమే కదా ఈ ముచ్చటా బావుంది అనుకున్నాను.

పాత తెలుగు సినిమాలో కాలెండర్ మీద కొన్ని పేజీలు గాలికి ఎగిరినట్లు కొంత కాలం గడిచింది. మళ్ళీ మరో పెళ్ళి. ఈ సారి ఎదురు సన్నాహాలు జరిగేక, 'పంజాబ్' నుంచి ' సంగీత్ ' ని పట్టుకొచ్చారు. 'పెళ్ళికి ముందు అమ్మాయి తరపున, అబ్బాయి తరుపున ఆడవాళ్ళందరూ కలిసి ఎకసెక్కాలు ఆడుకుంటూ పెళ్ళిపాటలుపాడుకునే' ఈ సీనుకు 'స్క్రిప్ట్' మార్చేసేరు. ముందుగా స్టేజి మీదకి ఎక్కి అమ్మాయిలు కొన్నిహిందీ సినిమా పాటలకి డాన్స్ లు చేశారు. అటుతరవాత అబ్బాయిలు పాంట్స్ మీదే తువ్వాళ్ళు కట్టుకుని (థాంక్ గాడ్) వాటిని ఊపుకుంటూ.. 'లుంగి డాన్స్' అంటూ పాట పెట్టుకుని డాన్స్ మొదలెట్టేరు.

అటుతరవాత మన అమెరికాలోకి మల్లెసే అమ్మాయి, అబ్బాయి (ఒక్కసారి కాదులెండి విడివిడిగా) మైకు పుచ్చుకుని, తమ స్నేహితుల మూలంగానే తాము జీవించిఉన్నాం అనీ, వాళ్ళు తమకి బహిఃప్రాణాల వంటి వారనీ, వాళ్ళ తోడు, సహాయం లేకపోతే తమ జీవితం గట్టెక్కేది కాదని - గట్టిగా చెప్పేరు ( మరి ఇంతకాలం వాళ్ళ అమ్మానాన్నలేం చేస్తున్నారని ఎవరు అడిగి


THIS PAGE IS SPONSORED BY VENKAIAH DAMA

VENKAIAH DAMA MS PE. CLU. ChFC

143-02 45· AVE. FLUSHING, NY 11355
PHONE: (718) 886 4077 FAX: (718) 886 7007
PHONE®: (718) 762 7173 E-mail: venkaiah.dama@nmfn.com

(In Financial Services since 1976)



TAX SAVINGS and/or DEFERRALS

JOINT COMPLIFE INSURANCES
529 COLLEGE SAVINGS PLAN
FIXED & VARIABLE ANNUITIES
IRAS: REGULAR, ROTH, SEP, SIMPLE & NON-QUALIFIED
KEOGH & CORPORATE PENSION PLANS
REQUIRED MINIMUM DISTRIBUTIONS
FOUR WAYS TO REDUCE CAPTIAL GAIN TAXES

# SUMA FOODS

**Teluguvaari Abhimaana Ruchi**

Quality, Taste
and Service

Ganesh
Murti





Snacks & Sweets by mail
For all your festival needs
Bobbatlu, Khaja, Kajjikaya
Mixture, Burelu and more

We ship anywhere
in the world

Fine Indian catering (Veg/Non-veg)
Event planning & management
Welcome packs & Gift packs
On-site preparation for
Weddings, Munj and
other large events

1184 Cozzens Lane, North Brunswick, NJ 08902 **(732) 940-1300** **sumafoods.com**

## Asalatha "Asha" Vikuntam

Realtor Associate



**Community Expert**

**2005 Member of Mercer County Board of Realtors**

**Cranbury Resident since 1999**

**Marketing Specialist**

Century 21

## Abrams, Hutchinson & Associates

**10 Schalks Crossing Road**
**Plainsboro, NJ 08536**
**609-750-7300**
**Cell Phone 732-470-4717**

నట్టు లేదు). తమ పెళ్ళి కుదిరిన నాటి నుంచి ఈ స్నేహితు లందరూ, ఎలా రాత్రిళ్ళు నిద్దర్లు మానుకుని, తమతో ఫోను మీద మాట్లాడి, ఎలా తోడునీడగా ఉన్నారో వివరించారు. పెళ్ళిచూపుల నాడు, మరోసారి పార్కులో ఓఅరగంట కలుసుకున్ననాటి నుంచి, తమ జీవితాలు ఎలా ముడిపడిపోయాయో, హృదయాల్ని అందరి ఎదుటా పరిచి, మరీ చెప్పుకున్నారు.

అటు తరవాత వెళ్ళింది హైదరాబాదులో మా పిన్ని మనవరాలి పెళ్ళికి. రెండు వైపులా పెళ్ళివారు బాగా ఉన్నవాళ్ళు. మంగళగిరి నుంచి వచ్చిన మగపెళ్లి వారు, అమలాపురం నుంచి వచ్చిన ఆడపెళ్ళి వారు కలిసి, వీధి మొత్తం కొనేసి నట్టుగా పెద్ద పందిళ్ళు వేసేసి, అంతకంటే పెద్ద బ్యాండ్ మేళంతో 'బారాత్' చేసేసుకున్నారు. 80 ఏళ్ల మా పిన్ని చేత కూడా చేతులు పైకె త్తించి, '**పంజాబీ భాంగడా డాన్స్**' చేయించడం మాత్రం, తెలుగు పెళ్ళికి మరపురాని హైలైట్ అనుకున్నాను. చివరాఖరిగా నేను చెప్పేదేవిటంటే ... ఇవన్నీ మనం సరదాగా నవ్వుకోడానికనికి చెప్పుకున్నవే గాని, తప్పొప్పులు జరుగుతు న్నాయని మాత్రం కాదు. ఇంటర్ నెట్టులు, ఈ మెయిల్సు, ఆన్ లైన్ ఛాట్ లు, స్కైప్ లు, ఫేస్ బుక్కు విరివిగా వ్యాపించిన ఈ యుగంలో, నిజంగా మనం ఎల్లలు లేని ప్రపంచంలో బతు కుతున్నాం. మనకి ఎక్కడ ఏది నచ్చిందో దాన్ని తెచ్చుకుంటు న్నాం. మన తెలుగు 'పెళ్ళి ప్రోటోకాల్ 'లో ఎన్ని మార్పులు వస్తున్నా... మొదట్లో మనం మాటాడుకున్న ముఖ్యమైన విషయాలని (పెళ్ళిలో జరగాల్సిన తంతులని) ఎవరూ మర్చి పోలేదు. వాటి మీద మనకి గౌరవం తగ్గనూ లేదు. అంటే వాటిని మాత్రం మన పెద్దలు 'చెరిగిపోని ఇంకు' తో రాసి పెట్టేరన్న మాట. మరి మన అమెరికా సంగతేం చేశావు? అని అడుగుతారేమో ... అదీ చెప్తాను. ఆ కథలో మీరు కూడా ఉంటారేమో? ఇంతకంటే ఎక్కువ పేజీలు పంపితే మన ఎడిటర్ గారు కోప్పడగలరు. అందుకని ఇప్పటికి సెలవు మరి.

## న్యూజీలాండ్ లో అజ్ఞాతవాసం

డా. చింతపల్లి గిరిజా శంకర్

చాలాకాలం క్రితం అంటే అరవయ్యో దశకం (1960 ల) నాటిమాట. అప్పుడే యం.డి పరీక్ష తప్పిన నన్ను గుంటూర్ జిల్లా వినుకొండ తాలూకాలో ఉన్న ఒక ఫామిలీ ప్లానింగ్ సెంటర్ ఉన్న కుగ్రామానికి ఫామిలీ ప్లానింగ్ మెడికల్ ఆఫీసర్ గా పంజేయమనిగా బదిలీ చేసింది మన కుశాగ్ర బుద్ధి గవర్నమెంట్. దాని పేరు **నూజెండ్ల**. అదే నేనందరితో **న్యూజిలండ్** అని చెప్తూ ఉంటాను. నేను చేసింది మెడిసిన్ (యం.డి). అందులో అసలు సర్జరీ ఉండదుగదా. సర్జరీకి పనికిరాననే కదా మెడిసిన్ చేసింది. ఆ యం.డి గూడా తప్పితిని. మరి నాలో ఏ సుగుణం చూసి నన్ను కుటుంబనియంత్రణ డాక్టరు గా వేశారో తెలియదు. కుటుంబనియంత్రణ అంటే వేసెక్టమీ, ట్యూబ ల్లైగేషన్ ఇత్యాది ఆపరేషన్లు చెయ్యాలి. దీనికీ నెలకి ఓ కోటా అంటూ వుంటుంది. సరే ఈ భాగోతం తరవాత. ఆ నూజెండ్లలో మొత్తం ఓ నూరు కుటుంబాలుంటాయి. ఎలిమెంటరీ స్కూలు మరియూ డాక్టర్ ఆఫీసు ఒక్కటే సిమెంట్ బిల్డింగ్. మిగిలినవన్నీ పూరిపాకలు. ఊళ్ళో కాఫీహోటెలు గానీ, కనీసం చిన్న కోమటి కొట్టుగానీ లేదు. వర్షాకాలం మూడు నాలుగునెలలు ఆ ఊరిచుట్టూ నీరు ఉంటుంది. పడవమీద ప్రయాణం. వినుకొండ దగ్గర బస్తీ సుమారు పది మైళ్ళు. వర్షాకాలం కాని రోజుల్లో ఒక ప్రైవేట్ బస్సుంది. ప్రైవేట్ బస్సంటే, ఎంతమందిని ప్రాణంపోకుండా ఉక్కిరిబిక్కిరిగా ఎక్కించగలరో అంతమందినీ ఎక్కిస్తారన్నమాట. అందులో మనుషులేకాదు, గొఱ్ఱెలు, కోళ్ళు, బుట్టలు, బస్తాలు ... ఒకటేమిటి చరాచర పదార్థాలన్నీ ఎక్కుతాయి.

అప్పుడే నాకు కొత్తగా పెళ్ళయింది. అసలే పరీక్ష తప్పి, కొత్త పెళ్ళాం దగ్గర నా పరువుబోయి యేడుస్తూంటే ఇట్లాంటి వూరు ఉద్యోగానికి మా అవిణ్ణి కాపురం తీసులెళ్తే విడాకులు ఖాయం. ఇందాకనే చెప్పానుకదా ఆవూరి విషయం. పైగా నాకు ఇంకో ఆరునెలల్లో ఇంకో పరీక్ష ఉంది. పాస్ అయితే గుంటూరు జనరల్ హాస్పిటల్లో ఉద్యోగమొస్తుందని ఆశ. ఇవన్నీ ఆలోచించి ఈ ఆర్నెల్లూ అజ్ఞాత వాసం చెస్తే సరిపోతుందని, మా ఆవిణ్ణి పుట్టింటికి పంపేసి, నేనొక్కణ్ణీ వినుకొండలో ఒక ఇంట్లో పోర్షన్ అద్దెకి తీసుకున్నాను. ఆ యింటి ఓనర్ అక్కడ కాలేజిలో లెక్చరర్. ఆయన, ఆయన భార్య, ఒక పిల్లాడు, ఆయన తల్లి

# BALACHANDAR JAYARAMAN

**CERTIFIED PUBLIC ACCOUNTANT**
**BUSINESS CONSULTANT**
**282 SAVOY AVENUE**
**EDISON, NJ 08820**

**Email: balajayaraman@msn.com**
**732-539-0924 (tel)**
**732-382-3151 (fax)**

**Member: AICPA**
**Member: NJSCPA**

**Licensed as CPA in NJ & IL**



**Free Initial Consultation** **Low Cost / High Quality Service**

**Prompt & Individual Attention by a CPA**

**On-Time Performance** **High Customer Satisfaction**

- *Tax Planning and Preparation*
- *Accounting and Auditing Services*
- *New Business Setup*
- *Financial Statements: Compilations, Reviews & Audits*
- *Sales Tax and Payroll Tax Returns*
- *Financial and Compliance Services for Government Programs*
- *For Corporations, Partnerships, Individuals, LLC/ LLP & Non-Profits*

*CALL ME AT 732-539-0924*

ఉండేవాళ్ళు. నా పోర్షన్ కీ వాళ్ళ పోర్షన్ కీ మధ్య తడికే అడ్డం. మాటలు వినబడుతుండేవి. అక్కడే ఒక పూటకూళ్ళ ఇంటినించి కారీయర్ తెప్పించుకునేవాణ్ణి. ఆ ఇల్లాలు, పాపం నేనూళ్ళోకి రాగానే కూజాలో కాసిని మంచినీళ్ళిచ్చేది. ఆయన్నెప్పుడో రెండు మూడు మార్లు మాత్రం చూసుంటాను. అత్తగారి మాటలు మాత్రం వినబడుతుండేవి. నాకు అప్పటికి పెళ్ళయి ఎక్కువ రోజులు కాలేదు. నాకు తడికగుండా పక్కింటి సంభాషణలు వినబడేవి. అత్తగారు ఆ ఇల్లాల్ని ఎప్పుడూ సూటి పోటి మాటల్తో సాధిస్తుండేది. "అబ్బాయి పెందరాళే వెళ్ళాలి గదా వాడికిష్టమైన గారెలూ అవీ్వ చేసిపెట్టచ్చుగదా? వాడింటికి రాగానే వేడివేడి కాఫీ ఇవ్వచ్చు గదా?" ఇత్యాది. పాపం ఆయిల్లాలు ఎప్పుడూ ఎదురుతిరిగి మాట్లాడినట్టు వినలేదు. ఆయనగూడా ఎప్పుడూ పెళ్ళాన్ని సమర్థించగా వినలేదు. ఆయిల్లాలి బాధ చూసి చాలా జాలేసేది. నాకు మా అవిడ మా అమ్మ గుర్తొచ్చారు. మా అమ్మ మంచిది. మా ఆవిణ్ణిలా సాధించదు. అయినా గుంటూరులో ఉంటారు. మావదిన, అన్నయ్య గూడా ఉన్నారు. సినిమాలు వగైరా.. ఏం భయంలేదని నచ్చచెప్పు కున్నాను.

చెప్పానుగదా నేను ఫామిలీ ప్లానింగ్ ఆఫీసర్ అని. నా హెడ్ ఆఫీసు నూజెండ్ల. ఊహించుకోండి! దానికి ఒక 15 మైళ్ళ దూరంలో చుట్టుపక్కల సబ్-సెంటర్స్ ఉంటాయి. వాటన్నిటినీ నేను సూపర్-వైజ్ చెయ్యాలి. రూల్స్ ప్రకారం నూజెండ్లలోనే ఉండాలి. కానీ మా ఆఫీసు క్లర్కూ, నర్సు, ఇత్యాది సిబ్బందంతా వినుకొండలోనే ఉంటారు. నూజెండ్లలో అక్కడే పుట్టిపెరిగిన ఒక యువతిని నర్సుగా ఉంచారు. నేను ఆనెస్ట్ ఆఫీసర్ అని నిరూపించుకోవటానికి ఒకరోజు కంకణం కట్టుకొని, నూజెండ్లని చూట్టానికి బయలుదేరాను. సరే బస్సు ప్రయాణం. అది పుష్పక విమానం. నేనొక్కణ్ణే పాంటూ షర్టూ తొడుక్కున్నవాణ్ణి. కాసేపు ఆ బస్సులో కూచున్నాక, కండక్టర్ నేను డాక్టర్నని పోల్చుకొని, ఒక సీట్ లో కూచోబెట్టాడు.జనం, జంతువులు, చుట్టకంపు, ఉల్లిపాయలకంపు, దుమ్ము, చమట, రొద ... మొత్తం మీద నేను నూజెండ్లకి వెళ్ళేటప్పటికి జబ్బు పడ్డవాళ్ళాగా వాంతి చేసు కున్నాను. అక్కడ బస్సు స్టాండ్ దగ్గిర ఒక సోడా తాగి ఎవర్నో అడిగి, నా ఆఫీసుకి వెళ్ళాను. నేను ముందు కబురు చేయకుండా వెళ్ళానేమో, అక్కడ ఎవ్వరూ లేరు. మా నర్సు తన బాయి ఫ్రెండ్ తో బిడిఒ కార్లో వినుకొండవోయిందిట సినిమా చూట్టానికి. బిడిఒ అంటే బ్లాక్ డెవలప్-మెంట్ ఆఫీసరన్నమాట. ఆ రోజుల్లో ఇట్లా పల్లెటూళ్ళల్లో పంజేసే డాక్టర్ల సౌకర్యంకొసం యునెస్కో మనదేశానికి రెనాల్ట్ వాన్లు ఇచ్చేవారు. కాంపులుచెయ్యడానికి, ఎమర్జన్సీలకి ... కాని ఇక్కడి మండలాధిపతి [బిడిఒ] రాజకీయం గా పలుకుబడి ఉన్నవాట్ట, అందుకని వాడు వాడుకునేవాడు ఆ కారుని. ఈ రాజకీయాలన్నీ నాకప్పుడు తెలియవు. ఎం.బి.బి.ఎస్ అవగానే ఎం.డి. తప్పి అప్పుడే ఉద్యోగంలో చేరాను. ఇంకా మన స్వతంత్ర భారత గణతంత్ర, ముఖ్యంగా పంచాయితీ పరిపాలన, ఎలా నడుస్తుందో తెలియదు. తీరావెళ్ళితే "నా" ఆఫీసు తాళం వేసి ఉంది. ఇంతలో ఎవరో ఆవూళ్ళోవున్న శివయ్యగార్ని తీసికొచ్చారు. ఆయన మాజీ యం.యల్.ఏ. కమ్యూనిస్ట్ పార్టీ. మళ్ళీ వాళ్ళ ప్రభుత్వంకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నాట్ట. వచ్చాడు. నా కులం గోత్రం అన్నీ అడిగాడు. నేను రూలుప్రకారం ఆవూళ్ళొనే నివసించాలనీ, అపుడు ఇటువంటి అవకతవకలు జరగవనీ (అంటే నర్సు ఇలా పరారీ అవ్వడం) అన్నాడు. "ఒక పక్కా బిల్డింగ్ గూడా లేని ఆవూళ్ళో నేనుండననీ, వినుకొండలోనే వుంటాననీ, బిడిఒని అరికట్టి ఆ వాన్ నాకు ఆధీనం చేస్తే రోజు రావడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాననీ" చెప్పాను. ఆయన కోపం నటించి, "మా ప్రభుత్వం త్వరలోనే వస్తుంది. అప్పుడు మిమ్మల్ని ఇక్కడే ఉంచేస్తాము. లేకపోతే బదిలీ చేస్తాము" అని బెదిరించాడు. అపుడు నేను, "అయ్యా! ఆపుణ్యం కట్టుకోండి. ఇంతకన్నా దగుల్బాజీ వూరు ఇంకోటి ఉంటుందనుకోను. బదిలీ చెయ్యించండి" అన్నాను. అపుడాయన "తాళం" మార్చి, (ఆఫీసు తలుపు తీసి) "డాక్టరుగారూ! అలా అనకండి. ఇంత వరకూ ఈ సెంటర్ ప్రారంభించాక ఈ వూరు వచ్చిన డాక్టరు మీరొక్కరే. మిగిలినవాళ్ళు అట్నించటే పరారు. అపుడపుడూ వస్తుండండి. ఈ బిడిఒకి ఇక్కడి నర్సుకి బాగా "దోస్తీ" మా ప్రభుత్వంవచ్చేదాకా మీ వాన్ ఇప్పించలేను." అని ప్రాధేయపడి, ఇంటినించి కాఫీ తెప్పించాడు, వాళ్ళ ఈడొచ్చిన అమ్మాయి ద్వారా. నాకు పెళ్ళయిన విషయం విని చాలా నొచ్చుకున్నాడు పాపం. ఆ తరవాత రెండుసార్లేమో వెళ్ళాను ఆవూరికి. ఇంతలోకీ

# SUBRAHMANYAM GANTI

## M.D., F.A.A.P

*Kind and gentle care for your child*

**Board Certified in Pediatrics**

Limited to infants, children and adolescents

***906 Oak Tree Road***
***Suite E***
***South Plainfield, NJ 07080***
(908) 822-1181

*OPEN – Monday to Saturday*
*Weekends & Evenings Available*

*By Appointment Only*
*Most Insurances Accepted*

*Affiliated to JFK, St. Peters & Robert Wood Johnson Hospitals*

వర్షాకాలమొచ్చింది, బస్సు మానేసింది. నేనూ మానేశాను. వినుకొండ గవర్నమెంట్ హాస్పిటల్లో ఒక అనుభవశాలి అయిన డాక్టరున్నాడు. ఆయన్ని పరిచయం చేసుకొని గవర్నమెంటు ఉద్యోగంలోని లోతుపాటులన్నీ  తెలుసుకోవడం మొదలెట్టాను. పై ఆఫీసర్లకీ, బి.డి.ఓలకీ, రెవెన్యూఆఫీసర్లకీ, గ్రామపంచాయతీవాళ్ళకీ ఎలా తైరు కొట్టాలో లేకపోతే ఎలా చీకాకుల్లో ఇరుక్కుపోతామో ఆయన దగ్గర నేర్చుకున్నాను.  ఆపరేషన్లేమీ చెయ్యలేదు. క్వార్టర్లీ రిపోర్ట్ వచ్చింది డి.యం.ఓ దగ్గిర్నించి. "**నీ ప్రోగ్రెస్ ఏమీ బాగాలేదు. నువ్వు ఒక్క ఆపరేషస్ గూడా చెయ్యలేదు. ఇల్లాగయితే? ...**" "**ఏం చేస్తావురా? బదిలీ చేస్తావా? చెయ్యి.**" అనుకున్నాను మనసులో. మొండివాడికుండే ధైర్యమంతా వచ్చింది. మరుసటి నెల్లో వినుకొండ డాక్టర్ సహాయంతో ఒక వాసెక్టమీ చేశాను. అంటే "సున్నానించి ఒకటి పురోభివృద్ధేకదా. మళ్ళీ క్వార్టర్లీ రిపోర్ట్ కి నేనక్కడ ఎలాగూ ఉండను అనే భరోసా.

ఇక నా ఆఫీసులో ఒక ఎల్.డి.సి, ఒక యు.డి.సి, ఒక ట్రావెల్ క్లర్క్, ఒక నర్సు ఉండేవాళ్ళు. ఆఫీసుపేరేగానీ అక్కడ ఒక బిల్డింగూ గట్రా ఏమీ లేదు. ఎవరింట్లో వాళ్ళుండి  పేపర్ వర్క్ చేసేవారు. మాది ఫామిలీ ప్లానింగ్ సెక్షన్ కాబట్టి రోగుల్ని చూడఖ్కర్లేదు. ఫామిలీ ప్లానింగ్ శిబిరాలు సెలెకొల్పడం, నడపడం, చిన్నచిన్నవూళ్ళకి వెళ్ళి, వాళ్ళకి కుటుంబ నియంత్రణ గురించి బోధించడం, అవసరమైనవాళ్ళకి ఆపరేషన్ చెయ్యడం, చేయించుకున్నవాళ్ళకి మందులు, చీరలు, పంచలు, ట్రాన్సిస్టర్ రేడియోలివ్వడం. ఇదీ మా ఉద్యోగం. రోగులు అంటే క్లయంట్స్ ని తేవడానికి ఇనస్పెక్టర్లు ఉంటారు. వాళ్ళకి కేసుకింత అని కమీషనిస్తారన్నమాట. పందిళ్ళు వేయించడం, దండోరాలు, సినిమా హాల్లో స్లైడ్ షోలు, పల్లెటూళ్ళల్లో ఉపన్యాసాలూ. నాకు కొత్తగాబట్టి నేనీ విద్యలన్నీ నా స్టాఫ్ దగ్గిరే నేర్చుకున్నాను. ఒకసారి డి.యం.ఓ దగ్గిర్నించి కొన్ని వేలరూపాయలొచ్చాయి, పందిళ్ళకీ, పాకలకీ, ఊరేగింపులకీ ఖర్చులకి. మా హెడ్ క్లర్క్ తో నేనన్నాను" ఎందుకండీ. మనమేంచెయ్యలేదుగా.ఆడబ్బు తిరిగి వెనక్కి పంపేద్దాము" అని. అతడు, పాముకాటు తిన్నవాడిలా చటుక్కున లేచి, "ఇంకానయం. అయ్యబాబోయ్! కొంపమునిగుతుందండీ. ఎందుకు చేయించలేదని ఎంక్వైరీ, సస్పెన్షన్ ఇల్లాటివ్వొస్తా"యన్నాడు. "మరేం చేద్దాం?" అంటే "నేజూసుకుంటాగా" అన్నాడు.


# Livingston Pediatrics

*You are our top priority!*

American Academy of Pediatrics

About Us . . . We handle the health care needs of infants, children and adolescents. Prenatal counseling is also available.

We will do our best to see that your child's health needs are served appropriately and quickly. Our practice has an experienced staff available to answer your questions.

Full modern office with electronic medical records.



**Dr. Ramalakshmi Yeramilli, MD**
Member of the AAP,
Board Certified in Pediatrics
Robert Wood Johnson University Hospital
St. Peters University Hospital, New Brunswick

www.livingstonpediatrics.com

**New Patients Welcome!**

We handle the health care needs of infants, children and adolescents.

**732-246-7171**
345 Livingston Ave.
New Brunswick, NJ 08901
Fax: 732-246-8974
Habla español, Hindi, Telugu

Office hours:
Monday - Saturday
Evening appts. available
By appointment only

Accepting Most Insurances


For the if in life®
Employee Benefit Plans
Executive Benefit Plans
Pension & Profit Sharing Plans
401(k), 403(b), SEP, 412(i) Plans
Health Insurance
Business Buy Sell Insurance
Commercial Insurance
Life Insurance
Long-Term Care Insurance
Disability Income Insurance
IRA, Roth IRA & Annuities
Retirement Planning
Estate Conservation Strategies
Auto and Home Insurance
MetLife®
One Blue Hill Plaza, 2nd Floor
P.O Box 1666, Pearl River, NY 10965
www.joseph.metlife.com
Tel. : 845-620-3115
Cell. : 845-323-3666
Get a Quote FREE
George Joseph
Financial Services Representative
Investment Adviser Representative
e-mail: gjoseph@metlife.com
CA Lic.# OE85378
Metropolitan Life Insurance Company(MLIC), New York, NY 10036.
Some health insurance products offered by unaffiliated insurers through the Enterprise General Insurance Agency Inc.(EGA), 300 Davidson Avenue Somerset, NJ 08873-4175. Securities and investment advisory services offered by MetLife Securities, Inc. (MSI) (member FINRA/SIPC), and a registered investment advisor. Auto and Home Insurance offered by Metropolitan Property and Casualty Ins. Co. (Met P&C®) and affiliates, Warwick, RI. MLIC, the EGA, MSI and Met P&C® are MetLife companies.
L1210150024[exp0112][AZ,CA,CT,FL,GA,MA,MD,NC,NJ,NY,OK,PA,TX,VA]

అతనితో కలసి ఎల్.డి.సి, నర్సు పంచాయితీవాళ్ళు ఏదో చెశారు. పందిళ్ళూ, పాకలూ, ఆపరేషన్లూ మాత్రం చెయ్యలేదు. ఖర్చు పెట్టినట్టు రశీదులుమాత్రం చూపించారు. నన్ను సంతకాలు పెట్టమన్నారు. అప్పుడు గర్తి నిర్ణయం చేసుకున్నాను, ఈసారి చాలా కష్టపడి పరీక్ష పాస్ అయి ఈ అజ్ఞాతవాసం తప్పించుకోవాలని.

ఒకసారి ఒకవూళ్ళో ప్రచారానికి బయలుదేరాము. అయిదారు మైళ్ళు, జట్కాలో వెళ్ళాము. మా క్లర్క్ ముందే టముకు వేయించాట్ట, ఒకచెట్టు కింద కుర్చీ వేశారు నాకొసం. వినడానికి వచ్చినవాళ్ళందరూ, అయితే చిన్నపిల్లలూ లేకపోతే ముసలివాళ్ళూ. వాళ్ళకి కుటుంబనియంత్రణగురించి చెబితే వింటారా? అని సందేహిస్తూనే మొదలెట్టాను. వాళ్ళు వినలేదు. పిల్లలు చాక్లెట్లు తీసుకుని ఉడాయించారు. పెద్దవాళ్ళు ట్రాన్సిస్టర్ రేడియో ఇవ్వలేదని తిట్టుకుంటూ వెళ్ళారు. ఇంతకీ యువతులూ, యువకులూ(అంటే కుటుంబనియంత్రణ గురించి అర్థం చేసుకోగలిగినవాళ్ళు, అవసరమున్నవాళ్ళు) పొలాలకి, వేరే పనులకి పోయారు. కొంతమంది పెద్దవాళ్ళు నావయసు అదీ అడిగి "డాక్టరువై ఉండి ఈ వుద్యోగమేమిటి నాయనా?" అని బాధపడ్డారు. చెప్పానుగా నాది సెంట్రల్ రూరల్ హెల్త్ సెంటరని. అంటే నా పర్యవేక్షణలో నాలుగు ప్రైమరీ హెల్త్ సెంటెర్స్ (పి.హెచ్.సి) ఉన్నాయన్నమాట. ఇందాక చెప్పిన వూరొకటి, వినుకొండ ఒకటి; ఇంకా రెండు కుగ్రామాలున్నాయ్. అయితే నాగార్జునసాగర్ డాం ధర్మమా అని చాలావూళ్ళ పొలాలు మాగాణులయ్యాయి. రెండుపంటలు పండిస్తున్నారు. ఒకవూరి నించి ఇంకోవూరికెళ్ళాలంటే పొలంగట్లమీద నడిచివెళ్ళాలి. లేదా మానుకోవాలి. అదుగో అటువంటి కుగ్రామంలోవుంది మా పి.హెచ్.సి ఒకటి. దాన్ని ఇన్స్పెక్షన్ చేసి పదియేళ్ళు దాటి పోయిందిట. "లెక్కా డొక్కా లేకుండా డబ్బులు పంపిస్తున్నాము, ఇన్స్పెక్షన్ రిపోర్ట్ వెంఠనే కావాలి" అని డి.యం.ఓ ఆఫీసునించి ఫర్మానా వచ్చింది. ఇంక మా క్లర్కులకిద్దరికీ ఒళ్ళూపైతెలీలేదు. (నాకు తరవాత్తెలిసింది..ఇన్స్పెక్షన్-కి వెళ్తే "ఆమ్యామ్యా" తగుల్తుందట. అదీ సంగతి) ఆవూరు వినుకొండకి పది మైళ్ళు. రోడ్డు లేదు, జట్కా పోదు. సరే నేనూ మా యు.డి.సి సైకిళ్ళు అద్దెకితీసుకొని ఒకానొక పొద్దున్న ఫలహారం, కాఫీ ముగించి బయల్దేరాము. పది మైళ్ళు అని పేరేగాని, మూడు మైళ్ళు వెళ్ళగానే మాగాణి పొలాలడ్డమొచ్చాయి. నాకేమో బెల్ట్ షూస్, పాంటూ, శ్లాక్ షర్టూను. అప్పటికే చమటలు బాగాపట్టి అలిసిపోయాను. మా క్లర్క్ మాత్రం


ARE YOU OR YOUR FAMILY MEMBERS SUFFERING FROM SEIZURES OR FITS?
HAVE YOU BEEN DIAGNOSED WITH EPILEPSY?
I CAN HELP.

**GAUTAMI K. RAO, MD**

**MEDICAL DIRECTOR, COMPREHENSIVE EPILEPSY UNIT**
**ASSISTANT PROFESSOR OF EPILEPSY**
**BOARD CERTIFIED NEUROLOGY**
**JFK NEUROSCIENCES INSTITUTE**
**EDISON, NJ 08818**
**732-321-7010**

**APPOINTMENTS AVAILABLE IMMEDIATELY. CALL TODAY!**

We offer comprehensive epilepsy evaluations, at our LEVEL 4 epilepsy center, including state of the art neuroimaging, neuropsychological evaluations and epilepsy surgery.

HELP US TO HELP YOU CHANGE YOUR LIFE FOR THE BETTER
**LANGUAGES: TELEGU, HINDI, FRENCH, ENGLISH**

మంచిహుషారుగావున్నాడు. దార్లో నాకు నూరిపోస్తున్నాడు అథారిటీ ఎలా చలాయించాలో, లేకపోతే అక్కడి నర్సు ఎలా మనల్ని మోసంచేస్తుందో, అవీ-ఇవీ అంటూ. "దాని గొడవ తరవాత లేవయ్యా, ముందీ మాగాణి పొలాల సంగజ్జూడమని" నేను తగులుకున్నాను. చివరికిద్దరం పాంట్లు మోకాళ్ళ దాకా మడిచాము,. చేతిరుమాళ్ళు తలక్కట్టుకున్నాం ఎండతగలకుండా. సైకిళ్ళు రెండుచేతుల్తో పైకెత్తి మోస్తూ పొలాలగట్లమీద అసిధారా వ్రతం లాగానడుచుకుంటూ, మధ్య మధ్య చెట్లకింద సేద తీర్చుకుంటూ, మధ్య మధ్య సైకిల్ తొక్కుకుంటూ రెండుగంటల తరవాత ఆవూరు చేరాము. పొద్దున్న ఎనిమిది  గంటలకి బయలు దేరినవాళ్ళం పదిగంటలకా వూరు చేరాం. ఒళ్ళంతా చమటలు కక్కుతున్నాం. దాంతో తడిసి, నలిగి శిధిలమైన చొక్కాలు, మోకాళ్ళదాకా మడిచిన పాంట్లూ, అక్కడి దాకా బురద, నెత్తిమీద సైకిళ్ళూ ... ఎవరన్నా మమ్మల్ని చూస్తే డాక్టర్లు కాదుకదా రోడ్లూడ్చేవాళ్ళన్నా నమ్మరు. అంత అసహ్యంగా వుంది పరిస్థితి. అయినా నా క్లర్క్ నాకు మా హుందాతనంగురించి ఉద్బోధ చేస్తూనేవున్నాడు.  సరే, వూళ్ళోకి వచ్చాక నేనన్నాను, "ముందేదైనా కాఫీ హోటల్ కి వెళ్దాం, శుభ్రంగా మొహం కాళ్ళూచేతులూ కడుక్కొని కాస్త మంచి కాఫీ తాగి అప్పుడు చేద్దాం ఇన్స్పెక్షన్" అన్నాను. ఆరా తీస్తేఆవూళ్ళో కాఫీ హోటల్ లేదుట. హతోస్మి! ఒక కోమటి కొట్టుంది. అక్కడ బెల్లం పప్పుచెక్క, బిళ్ళ కాఫీ దొరుకుతుందిట!  ఏం గతి? అక్కడికే వెళ్ళాం. చాలా గలీజుగా వుంది ఆ స్థలం. ఇంతలోకీ మా క్లర్క్ ఎవర్నోపట్టుకొని ఏదో చెవిలో చెప్పాడు. "అలాగేనయ్యా" అని వాడు పరిగెత్తాడు. అక్కడ కోమటి కొట్లో మనుషులకీ గొడ్లకీ ఒకే గాబులో వున్నయి నీళ్ళు.  అక్కడ నేను ఒళ్ళు కడుక్కోదల్చుకోలేదు. బెల్లం పప్పుచెక్కనిండా ఈగలు ముసిరున్నాయి. సరే, బిళ్ళకాఫీయే దక్కుడు. ఒకగుక్క తాగేటప్పటికి, మూడురోజులకిందట తిన్న అన్నం గూడా వాంతొచ్చినంతపనయ్యింది. దానికి స్వస్తి చెప్పాను. నా క్లర్క్ మాత్రం అదేదో స్వర్గం లాగా అక్కడ కాళ్ళూ, మొహం కడుక్కున్నాడు.  బెల్లం పప్పుచెక్క తిని కాఫీ తాగి మళ్ళీ మొదలెట్టాడు నాకు బోధ. నేనన్నాను, "చూడు సుబ్రమణ్యం! నాకు కాఫీ పడితేనేగానీ బుర్ర పంజేయదు. పద ఆ పి.హెచ్.సి కి వెళ్దాం. అక్కడ నర్సన్నా కాసిని కాఫీ నీళ్ళు పోస్తుందేమో" మళ్ళీ నాకు బోధించాడు, "అక్కడ తీసుకోగూడదు సార్! కాంఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్ . అక్కడ కాఫీ, టిఫిన్లు తింటే వాళ్ళు లంచమిచ్చినట్టు  ఫీలవుతారు. మనం


**Simhadri M Gupta MD**

**Board Certified in Neurology since 1998**

**Trained at Mt Sinai Hospital, NY city**
**Subspecialty Neuromuscular disease**

Office Locations

2 Lincoln Highway, Suite 302
Edison, NJ 08820

81 Veronica Avenue, suite 201
Somerset, NJ

Telephone: 732-548-1770; 732-548-1778 Fax 732 548-1772

Languages: English, Telugu, Gujarati, Hindi, Kannada and other translations

హానెస్ట్ రిపోర్ట్ ఇవ్వలేం" ... నాకతనేంజెప్తున్నాడో వినబట్టంలేదు. ఏదో మైకంలో ... సెంటర్-కి వచ్చాం. మా అదృష్టవశాత్తూ ఆ సెంటర్ ఓపెన్ చేసేవుంది. నర్సు లోపల వున్నదని తెలిసింది. నర్సుల్లో చాలారకాలుంటారు. మాతోబాటే, గుంటూరు జనరల్ హాస్పిటల్లో నర్సింగ్ ట్రెయినింగ్ స్కూల్ గూడా వుండెది. అక్కడ స్టూడెంట్ నర్సులుండేవారు. LVN అంటే ఒక సంవత్సరం కోర్స్. RN అంటే రెండు సంవత్సరాలు. మాకు చాలామంది కేరళ నించి వచ్చేవారు. చాలా అందంగా వుండేవాళ్ళు. అందులో ఆ తెల్లని యూనిఫార్మ్ లో మరీ. ఇక్కడికి వచ్చాక తెలుగునేర్చుకొని తెలుగువాళ్ళలాగే వుండేవాళ్ళు, మాటా, వేషధారణా అన్నీ. వీళ్ళకీ మాకూ కొన్ని కామన్ కోర్స్ లుంటాయి. వీళ్ళని "సిస్టర్" అని సంబోధించే వాళ్ళం. మా టీచరొకాయన మాత్రం కొంతమంది అందంగా వుండే వాళ్ళని సిస్టర్ అనేవాడు కాదు. నర్స్ అనో లేక పేరుపెట్టో పిలిచేవాడు, వాళ్ళు వద్దంటున్నాఅయన అసలు పేరేమిటోగాని, మేం మాత్రం "నర్సరాజ్" అని పిలిచేవాళ్ళం. చిన్న టోపీ వుండి తెల్లచీర కట్టుకుంటే LVN అన్నమాట. వీళ్ళందరు చెప్పిన పనులూ చేస్తారు. చిన్న కాప్ పట్టుకొని యూనిఫార్మ్ వేసుకుంటే, PN అన్నమాట. వీళ్ళందరి మాటా వింటారు. అసిస్టెంట్ రౌండ్స్ కి వచ్చినప్పుడు వీళ్ళొస్తారు. ఇంకొంచెం పెద్ద కాప్ పెట్టుకొని, యూనిఫాం వేసుకుంటే స్టాఫ్ నర్స్ అన్నమాట. వీళ్ళు LVN, PN ల మీద పెత్తనం చలాయిస్తారు. ఛీఫ్ రౌండ్సప్పుడొస్తారు. ఇంకొం చెం పెద్ద కాప్, అంటే చాటంత కాపుండి, చేతులు వెనకపెట్టుకునో లేక పేద్ద జేబుల్లో పెట్టుకునో వుండే వాళ్ళని హెడ్ నర్స్ అంటారు. వీళ్ళు ఎవ్వరిమాటా వినరు, ఒక్క మాట్రన్, సూపెరింటెండెంట్ మాటతప్ప. వీళ్ళని మేము" వెనకే చేతులు, హెడ్లెస్ నర్స్, చాట నర్సులనే" వాళ్ళం. వీళ్ళు మామూలుగా, నడివయసులో ఉండి బాగా లావుగావుంటారు. చాలావరకు ఇంగ్లీషులోనే మాట్లాడతారు (తెలుగు రానట్టు ప్రవర్తించడంకూడా కద్దు) హాస్పటల్ మొత్తానికి ఒక ముసలామె వుంటుంది . ఆమెని మాట్రన్ అంటారు. ఆమె పనీ చెయ్యదూ, ఎవ్వరిమాటా వినదు. మొగుడిమాటసలే వినదు. అప్పుడప్పుడు రౌండ్స్ కి వస్తూంటుంది, నర్సులమీద పెత్తనానికి. ఎప్పుడూ ఇంగ్లీషులోనే మాట్లాడుతుంది. ఈమెని చూసి మిగిలిన నర్సులంతా గజ గజ వణుకుతుంటారు. అదిగో అలాగ మా హాస్పిటల్లో ట్రెయిన్ అయిన ఒకానొక నర్స్, సుమిత్ర అక్కడ పంజేస్తున్నదన్నమాట. నాకు ముందుగా తెలియదు. తీరా నేను ఆ గుడిసె లోకి వెళ్ళాను తల దించుకొని, నా అవతారాన్ని నేనే తిట్టుకుంటూ, కాఫీ కోసం అలమటించి పోతూ. ఇంతలో ఒక సన్నని తియ్యని కంఠం పలకరించింది, "బాగున్నారా? గిరిజా శంకర్ గారూ?" తలయెత్తి చూస్తే సుమిత్ర. LVN. నాతో బాటు OB-GYN రొటేషన్ చేసింది. అందంగా వుండేది. (ఇప్పుడుగూడా చాలా బాగుంది). చిరునవ్వుతూ కేసులన్నీ ఎగరేసుకుపోయేది. సుమిత్రని చూడ గానే




# Bayshore Ophthalmology, LLC



Dr. Surekha Collur

NJ Top Docs

**SUREKHA COLLUR, MD, FRCS**

Board Certified Ophthalmologist
Fellowship Trained in Glaucoma

**CATARACT • GLAUCOMA**
**EYELIDS • PRK**
**MULTIFOCAL LENS IMPLANTS**
**Femtosecond Laser Assisted Cataract Surgery**



Dr. Prapti Shah, OD
OD 270A00649200
OM 270M00115300

## Visit Our Onsite Optical Shop

CARE CREDIT
Evening Hours and Saturdays

Follow us On Facebook

**YOU CAN MAKE APPOINTMENTS VIA OUR WEBSITE**
www.bayshoreophthalmology.com

**719 North Beers Street • Holmdel**
**(732) 264-6464**

# THE BEST OF BHIMAS' FLAVORS NOW IN EVERY HOME.




**Bring home the traditional flavour of Bhimas**
Bhimas' has never failed to tickle the palate of its patrons with its distinct sambar, rasam, idli chilli and dhal powders. Legend has it that a trip to the temple town of Tirupati isn't complete until a meal at Bhimas Hotel is done with. Let these legendary flavours be a part of your home menu. Bhimas and none other.

THIRUPATHI BHIMAS

Tirupathi Bhimas Spice & Foods Pvt. Ltd, India
For Trade Inquiries, please contact:
East Coast: Sourish International Foods LLC (An ASTA Member)
Contact: Geethanjali Devi | Tel: 201.820.4198
E-mail: githa_d@yahoo.com

నా అవతారం మీద అసహ్యం, ఏవగింపూ ద్విగుణీకృతమయాయి. తేరుకున్నాక "మంచినీళ్ళు" అని జడ్డిగా అడిగాను. ఇద్దరికీ మంచినీళ్ళు తెచ్చిచ్చింది. మా క్లర్క్ ఏదో హుందాగా ఉద్ధరిస్తున్నట్టు తీసుకున్నాడు. "ఏవీ? నీ ఫైల్స్ అవ్వీ ఎక్కడున్నాయి?" అని అధికారం చూపించాడు. నేను మంచినీళ్ళుతాగి, "ఇంకొక గ్లాసు" అని తీసుకొని, " సిస్టర్! కాఫీ ఏమైనా దొరుకుతుందా?" అని అర్థించాను. మా క్లర్క్ నా వైపు అసహ్యంగా చూశాడు, నేనేదో పనికిమాలిన పని జేసినట్టు. ఫైల్స్ ని అతడికి చూపించి, "ఇప్పుడే క్షణంలో తెస్తాను" (అదే ఇల్లు గూడానట) అని పది నిమిషాల్లో ఫిల్టర్ కాఫీ తెచ్చింది. అద్భుతం గా వుంది నాకు. సుబ్రమణ్యం గూడా "ఇష్టంలేకుండానే" తాగాడు. తాగుతూనే అడుగుతున్నాడామెను, "అదెక్కడుందీ? ఇదెక్కడుం దీ?"అని. ఆమె వాడికి ఉన్నవి చూపిస్తూనే, నాతో మేం చదువుకునేరోజుల గురించి ముచ్చటిస్తోంది. అష్టావధానం కాదు గానీ "ద్వంద్వావధానం". "భోం చేస్తారా గిరిజా శంకర్ గారూ" అని స్వీట్ గా అడిగింది. నేను "చేస్తాను" అనేలోగానే సుబ్రమణ్యం "లేదు" అని నిఖ్ఖచ్చిగా చెప్పాడు. "ఏదీ ఆ అకౌంట్స్ చూపిం చు?" అనడిగాడు. ఆమె నావైపి తిరిగి, "ఇది పూరిపాకగదండీ, అన్ని ఫైల్స్, అకౌంట్స్, బుక్స్ ... ఇదిగో ఈ షల్ఫ్ లో పెడతాను, వర్షమొస్తే తడిసి పోతాయండి. నంబర్లు సరిగ్గా కనబడవేమో. పులిమినట్లుంటాయి. గత నాలుగేళ్ళగా అడుగుతున్నానండి స్టీల్ ఫైల్ బాక్స్ కోసం. ఇదిగోనండి రిజెక్షన్ లెటర్" అని చూపించింది. మా వాడు అవ్వన్నీ చూస్తున్నట్టు నటిస్తున్నాడు. మేమిద్దరం మేం చదువుకునే రోజుల గురించి మాట్లాడుకుంటున్నాం. నాకు ఆమె అన్నీ నిజమే చెప్తోంది అని గాఢ నమ్మకమేర్పడింది. గంట పన్నెండు  అవుతోంది. అప్పుడే ఆ కోమటికొట్లో మా సుబ్రమణ్యం పురమాయించి పంపాడే, ఆ కుర్రాడొచ్చాడు, ఒగర్చుకుంటూ. మావాడికేదో సైగ చేశాడు. సుబ్రమణ్యం ఏదో జ్ఞాపకమొచ్చిన వాళ్ళాగా, ఠక్కునలేచి, "ఏదీ నీ ఇన్స్పెక్షన్ చెక్-లిస్ట్?" అన్నాడు. సుమిత్ర అతడిచేతికిచ్చింది. నేను వాడి చేతుల్లోంచి లాక్కొని, అన్నిటికి  ఎక్సెలెంట్ అని రిమార్క్ రాసి సంతకం పెట్టి, మంఛి కాఫీ ఇచ్చి నా ప్రాణం నిలబెట్టినందుకు చాలా చాలా థాంక్స్ చెప్పి, బయటికి వచ్చి, అడిగాను, " ఇప్పుడెక్కడికి?" "పదండి కరణం గారింటికి" అన్నాడు. అదెందుకో నాకు తెలియదు. వెనక్కి చూస్తే సుమిత్ర అందమైన మొహం చిరునవ్వుతో కనబడింది. "చాలా బాగుంది" అన్నది మనస్సు. "బుద్ధి లేదూ? నీకు పెళ్ళయింది"


CITIAIR TRAVEL
888.248.4697
Lowest Airfare Challenge
CITIAIR
Cheap Airfares to India
All Airlines
British Airways,Qatar,
Etihad, Emirates, Air India,
Gulf, Luftansa, and more

అన్నది బుద్ధి. "చాలా బాగున్నది కాఫీ" అని సర్దిచెప్పింది మనస్సు. ఇవేవీ పట్టనట్లు సుబ్రమణ్యం ఎవరితోనో మాట్లాడి సైకిలెక్కాడు. నేను వాణ్ణి ఫాలో అయ్యాను. కొంతసేపటికి, ఒక పూరిల్లు ముందాగాం. "కరణం గారూ" అని పిలిచాడుసుబ్రమణ్యం. "లేరండి. పొలమెళ్ళారు" అంటూ ఒక ఇల్లాలు బయటికొచ్చింది. మమ్మల్ని చూసి పమిట సర్దుకొని, "మీరేనా ఇందాకా కబురు పంపింది? కూర్చోండి. కబురు చెశాను. వచ్చేస్తూంటారు" అని మంచం వాల్చింది ఆయిల్లాలు. "ఏమిటయ్యా ఇది?" కళ్ళతోనే అడిగాను. "కరణం గారిల్లండీ. భోజనం పెడతారు. తిని వెళ్దాం. వీళ్ళకి గవర్నమెంట్ స్టయిపెండ్ ఇస్తుంది మనబోటి "ఆఫీసర్లు" వచ్చినప్పుడు ఆతిథ్యానికి" అని చెప్పాడు. మాదీ కరణాల కుటుంబమే. కానీ నాకీ లొసుగులు తెలీదు. ఇంతలోకి కరణం గారొచ్చి, "క్షమించండి. ఆలశ్యమయింది. రండి. కాళ్ళు కడుక్కోండి. నేను పొద్దున్నే భోజనంచేసి పొలం వెళ్తాను. ఇక సాయంత్రం దాకా తిన్ను." అని పెళ్ళాన్ని పురమాయించడానికి లోపలికెళ్ళాడు. ఇల్లాలు రెండు విస్తరాకులూ, రెండు ఇత్తడి గ్లాసుల్లో నీళ్ళు తెచ్చి, ఆ వరండాలో చాప పరిచి "కూచోండి" అని లోపలికి వెళ్ళింది. "మేమూ బ్రాహ్మలమేమంటూ" మావాడేదో చెప్పబోయాడు. నేనే వాణ్ణాపాను, "మన అవతారాలు చూడు. మనమెలావున్నాం? కనీసం ఈ వరండాలోనైనా భోజనం పెట్టింది. కిమ్మనకుండా సంతోషంగా తిను" ఆరోజు మొట్టమొదటిసారిగా నేను వాడికి బోధ చేశాను. ఏమనుకున్నాడొ, నోరుమూసుకు తిన్నాడు. ఏదో ఒక ఆకు కూరా, చింతకాయ పచ్చడి, మజ్జిగ. అన్నం కడుపునిండా తిన్నాను. ఎంత ఆకలిగావుందో! అంత కమ్మని భోజనం మా అమ్మచేత గూడా తినలేదేమో! అన్నదాతా సుఖీభవ! కరణం గారికి, భార్యకి కృతజ్ఞతలుచెప్పి మళ్ళీ సైకిలెక్కాము. దారిలో నాక నిపించింది, "జీవితంలో మొట్టమొదటిసారి అడుక్కు తిన్నానన్నమాట" సుమిత్రని చూడ్డానికావూరు మళ్ళీ వెళ్దామని చాలాసార్లు అనుకున్నాను. కానీ హెలికాప్టర్ మీద మాత్రమే వెళ్ళగలిగిన ఆ వూరి ప్రయాణం తలుచుకొని భయపడి మానేశాను. న్యూజిలాండ్ ... అదేనండీ నూజెండ్ల ఆ తరవాత మరో రెండుసార్లు వెళ్ళాను. శివయ్య గారికింకా పదవీ పలుకుబడీ రాలేదు. ఈ కష్టాలు తప్పించుకోవడానికి బాగా కష్టపడి చదివి, యం.డి పాస్ అయ్యి గుంటూరు జనరల్ హాస్పటల్లొ వుద్యోగం సంపాదించాను. వినుకొండలో మకాం ఎత్తేశాను.

అదండీ నా ఆరునెల్ల "న్యూజిలాండ్ అజ్ఞాతవాసం".

## నయా "గారం"

శ్రీమతి అనుపమ గుళ్ళపల్లి

ఇది ఈనాటి కోరిక కాదు. చిన్నతనంలో దాని గురించి విన్నప్పటి నుండి ఎందుకో అదంటే ప్రత్యేకమైన ఇష్టం ఏర్పడింది. రెండేళ్ళ క్రితం వరకు "ఆ...ఇది జరుగుతుందా, పెడుతుందా?" అనుకునేదాన్ని. కానీ జరుగుతుంది అని తెలిశాక, కొన్ని నెలలు గా "ఎప్పుడెప్పుడా?" అనుకుంటూ గడిపాను. తీరా కన్ను మూసితెరిచేసరికి ఐపోయింది అని ఇప్పటికీ నమ్మకం కలగట్లేదు. **'నయాగరా జలపాతం'** - ఎటువంటి 'మూడ్' లో ఉన్న మనిషికైనా నూతనోత్సాహాన్ని నింపగల మాయ తెలిసిన మహాద్భుతం. అమెరికా దేశంలో అడుగు పెట్టిన భారతీయులెవ్వరూ దీన్ని పలకరించకుండా వెనక్కి బయల్దేరరు. ప్రత్యేకించి భారతీయులు అని ఎందుకు అంటున్నానంటే, ప్రకృతి అంటే మనవాళ్ళు ప్రాణం పెడతారు, నాకు ఇతర దేశీయులతో పరిచయమూ లేదు. నాకూ అమెరికా వస్తానని తెలిసిన దగ్గర నుండి ఎప్పుడు వెళ్లి నయాగరాను చూడాలా అని ఆరాటం ఉండేది. మా అత్తగారు, మామగారు మమ్మల్ని చూడటానికి అమెరికా వచ్చినప్పుడు కొన్ని మంచి మంచి ప్రదేశాలు చూపించాలి అని ప్లాన్ వేసుకుని, ఆ లిస్టు లో మొట్ట మొదట దీని పేరు రాసేశాం. వాళ్ళ ఆరు నెలల అమెరికా ప్రయాణంలో రెండున్నర నెలలు ఐపోయాక చికాగో వెళ్లాలని అనుకున్నాం. ఇంకొక నెలన్నర కౌంట్ డౌన్ అయ్యేవరకు మాకు ఏ వారాంతమూ ప్రకృతి సహకరించలేదు. ఇక ఒకరోజు చికాగో వద్దు, నయాగరా వెళ్దాం అనుకున్నాం. అంతే ముహూర్తం కుదిరితే ఎవ్వరూ ఆపలేరన్నట్లు అనుకున్నదే తడవుగా మర్నాడు ప్రయాణమయ్యాం నయాగరాకి. ప్రకృతీ కిమ్మనకుండా ఉంది. శనివారం పొద్దున్నే బయల్దేరుతాం అనగా శుక్రవారం రాత్రే రెండు పూటలకి

సరిపడా వండుకుని సర్దేసుకున్నాం. **'పొద్దున్నే మూడింటికి లేచేశాను**' అన్న బద్ధకం గానీ, '**కారు రెంటుకిచ్చిన వాడు (లెర్నర్స్ పెర్మిట్ మాత్రమే ఉన్న) నన్ను నడపద్దు అన్నాడ**'న్న బాధ గానీ, 'సమయానికి నయాగరా కోసమని దాచుకున్న డ్రెస్ టాప్ కనిపించలేద'న్న బెంగ గానీ లేకుండా కార్ లో ఉల్లాసంగా కూర్చుని ప్రయాణం చేశాను.

ఎనిమిదిన్నర గంటల ప్రయాణం. పాపం మా ఆయన ఒక్కరే కార్ నడిపారు. నలుగురం కలిసి పాటలు పాడుకుంటూ ఝూం ఝూం మని ప్రయాణం చేశాం. మధ్యలో ఇంటి నుంచి తెచ్చుకున్న ఇడ్లీలు లాగించినా, హోటల్-రూంకి చేరేసరికి కడుపులో గణగణా గంటలు మోగేస్తున్నాయ్ నలుగురికీ. ప్యాక్ చేసి తెచ్చుకున్న లంచ్ పూర్తి చేసేసి గబగబా తయారైపోయి బయలుదేరాం. నయాగరా జలపాతం హోరు మొదట ఎవరు వింటారు? జలపాతాన్ని మొదట ఎవరు చూస్తారు? అని పందేలు పెట్టుకుంటూ వెళ్లాం. కొద్దిగా దారి తప్పినా, మొత్తానికి చేరుకున్నాం. తీరా వెళ్లి చూద్దును కదా. నా ఉత్సాహం కొద్దిగా నీరు కారింది. మా మీద అలిగినట్లు జలపాతం ఒక్క 125 డిగ్రీలు అటువైపుకి తిరిగి నుంచుంది. నేను ఇంటర్నెట్ లో, పుస్తకాల్లో చూసిన ఫోటోలలో లాగా మనకి ఎదురుగా జలపాతం మన వైపుకి పడుతూ దర్శనం ఇస్తుందనీ, కనుచూపు మేరలో ఎడమ వైపు చివర నుండి కుడి వైపు చివరవరకు జలపాతమే ఉంటుందనీ ఊహించుకున్నాను అంతకుముందు. ఇప్పుడు అలా లేదు సరికదా, పక్కకి (ఇంకా చెప్పాలంటే వెనక్కి) తిరిగి దాక్కుంది ఇది. నేను చూసిన ఫోటోలన్నీ కెనడా వైపు నుండి తీసినవి కాబోలు అనుకున్నాను. అయితే **'మెయిడ్ ఆఫ్ ది మిస్ట్'** బోట్ రైడ్ తీసుకున్నప్పుడు నా కల నెరవేరింది. ఆ నీటి ప్రవాహం అలా కిందకి పడి, రాళ్ళకి కొట్టుకుని, చింది అల్లంతదూరాన ఉన్న మన మీదకి పడుతుంటే ఆ ఆనందం వర్ణనాతీతం. దీన్ని నేను గంగావతరణంతో పోల్చాలా, క్షీరాభిషేకంతో పోల్చాలా, ఇంకేమైనా ఉపమానాలు వెతకాలా అని ఆలోచించాను, చివరికి ఆ ప్రయత్నం మానుకుంటున్నాను. కొన్ని పోల్చకుండా, వర్ణించకుండా ఉండటమే కరెక్ట్ కదా? అది అయిపోయాక, చీకటి పడ్డాక వేసే 'ఇల్ల్యూమినేషన్ షో' చూడటం కోసం మేము చాలాసేపు ఆ పక్కనే ఉన్న పార్కులో కూర్చున్నాం జలపాతం ఉన్న వైపు చూస్తూ. అంతసేపు మేము కూర్చున్నందుకు, పాపం మా ఆయన ఎనిమిదిన్నర గంటలు కారు నడిపి తీసుకువచ్చినందుకు, జాలి పడి ఆ జలపాతం ఒక్క పది నిముషాలు ఇటు వైపుకి తిరిగి నుంచుని, మళ్ళీ అటు తిరిగిపోవచ్చు కదా అనిపించింది. రాత్రి షో మరొకచక్కటి అందం. ఏమైనా హోలీ



ఆడుతున్నట్లున్న ఆ నయాగరా తల్లి కుడి చెంపని మాత్రమే చూడగలిగాం మేము. హోటల్ కి వచ్చి, మారుమాట్లాడ కుండా ఆ అందాన్ని కళ్ళలో నింపుకుని నిద్రలోకి జారుకున్నాం. మర్నాడు మళ్ళీ తొమ్మిది గంటల ప్రయాణం తర్వాత ఇంటికి చేరు కున్నాం.

నా చిరకాల వాంఛలలో ముఖ్యమైన దీన్ని మా ఆయన తీర్చారు. అయితే ఆ చిన్న 125 డిగ్రీ అసంతృప్తి మిగిలిపోయింది.

ఈసారి కెనడాలో ప్రాజెక్టు సంపాదించమంటూ మా ఆయన దగ్గర '**నయా**' '**గారా**'లు పోయాను నేను.

## నిప్పు రవ్వలు

శ్రీమతి కొమరవోలు సరోజ , టొరాంటో, కెనడా

సహజంగానే ప్రకృతిని అందంగా సృష్టించాడా పరమాత్మ. అందమైన ఆడపిల్ల సౌందర్య సాధనాలు ఉపయోగిస్తే మరీ అందంగా కనపడినట్లు రంగులు మారిన చెట్ల ఆకులు పసుపు-కుంకుమ రాసులు చెట్లమీద కుమ్మరించినట్లు. వయ్యారాలొలికిస్తు రంగుల రాజకుమార్తెల్లాగా ఫాల్-సీజన్ కి శుభస్వాగతం పలుకుతున్నాయి. ఆరోజు శనివారం ఉదయం కావటం వల్ల తెలుగు భారతి రేడియో ప్రోగ్రామ్ ప్రారంభమైంది, ఎవరో చక్కటి స్వరంతో. చెట్ల ఆకులే కాదు సుమండీ మానవ శరీరం కూడా రంగుల కలయికే. ఎవరో తలవెంట్రుకలు, కనుపాపలు, కనుబొమ్మలు నల్లగా, పలువరస తెల్లగా, నాలుక గులాబీ రంగుగా అని వర్ణిస్తూ ఏవో సినిమా పాటలు మేళవించి ఆ నాటి రేడియో కార్యక్రమం ప్రారంభించారు.

**తేజల్**

అప్పుడే నిద్ర లేచి బ్రష్ చేసుకుని యాలక్కాయలు కొట్టి వేసి టీ పెట్టుకుని కప్పులో పోసుకుని.రేడియో వింటూ వంట గదిలో బ్రేక్ ఫాస్ట్ టేబుల్ దగ్గర కూర్చుంది. కానీ మనస్సు నిలకడగా లేక ఆలోచనలు ఎటో వెళ్లడం మొదలైంది. రేడియో ఆపేసి పేపరు చూడసాగింది. అక్కడా అదే తంతు. పేపరవతల పడేసి టీవీ ఆన్ చేసింది. కానీ అక్కడా చుక్కెదురే. దీని దుంపతెగ ఈ మనస్సు అన్నింటికంటే అత్యంత ప్రమాదకరం అనుకుంటూ. టీ ఒక్క గుక్కలో తాగేసి తలుపు తాళం వేసి వాకింగ్ కి బయల్దేరింది. అయినా మనస్సెటో వెళ్ళిపోతూనే వుంది. మనస్సు ఆమె చెప్పు చేతలలో లేదు. ఆమే మనసు వశమైపోయింది. ఇంటికి వచ్చి హ్యాండ్ బ్యాగ్ తీసుకుని తను వుంటున్న బిల్డింగ్ కి ఎదురుగా వున్న మాల్ కి బయల్దేరింది వారానికి సరిపడా కూరగాయలు, పండ్లు, బ్రెడ్,పాలు తెచ్చుకుందాం అనుకుంటూ. "ఏ పాటు తప్పినా సాపాటు తప్పదుగా" అనుకుంటూ రోడ్ క్రాస్ చేసింది.

**గిరిధర్**

కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నాడు. తప్పెవరిది? తనదా? ఆమెదా? తనదంతా ఒప్పే ! ఆమెదే తప్పు. పెళ్ళికి ముందే తను చెప్పాడు కదా! తను చెప్పిన షరతులన్నింటికీ ఆమె ఒప్పుకున్న తరువాతే కదా! పెళ్లయింది. మరి నాలుగేళ్లలో తన ఆలోచనా విధానం అంత మారి పోయిందెందుకని? తను ఇంటికి డబ్బు పంపించక పోతే అక్కడ అమ్మా నాన్నలకు ఇబ్బంది. తమ్ముడూ చెల్లెలూ ఇంకా చదువుకుంటున్నారు. కరువులో అధికమాసమన్నట్లు అమ్మకు కేన్సర్ రావటం. తనూ తన అమ్మా నాన్నలకు ప్రతినెలా డబ్బు పంపిస్తూనే వుంది. అయితే అసలు సమస్య అదికాదు. లేచినప్పటినుంచీ పిల్లలు కావాలి పిల్లలు కావాలి ఇదే నస. తనకు అది సుతరాము ఇష్టం లేదు. నెలరోజులు కావస్తోంది తను విడిగా వచ్చేసి. ఒక్కనాడు కూడా మిమ్మల్ని చూడాలనుంది అని ఫోన్ చేయలేదు. ఫోనైతే చేసింది రెండుసార్లు "బాగానే వున్నారా? ఏమైనా కావాలా?" ఈ రెండు ప్రశ్నలు తప్ప మరొక్క మాట వుండదు. గర్వం, అహం, తల పొగరుకే మాత్రం తక్కువలేదు. పైపెచ్చు తను స్పాన్సర్ చేసి ఈ మొగుడు గాడ్ని పిలిపించిందని అదో బడాయి. అసలీ దేశానికి రావటమే తను చేసిన పెద్ద తప్పు. ఇండియాలో డబ్బు లేక దరిద్రం. కనీసం ఈ దేశానికి వస్తే తిండికి గుడ్డకి లోటులేకుండా వుంటుందని తను తేజల్ ని చేసుకున్నాడు. అమ్మా నాన్న చూసిన సంబంధమే కదా! అనుకుని సంబరపడ్డాడప్పుడు. అంతే కానీ దీని రూపం చూసికాదు. దీని అవతారం చూసి ఎవడు పడిపోతాడు! నలుపు, పొట్టి, లావు, పళ్లెత్తు తను అందగాడే అయినా దాని సంపాదన చూసి ఒక్కనాడంటే ఒక్కనాడు కూడా వేళాకోళంగా కూడా తన రూపం గురించి మాట్లాడలేదు. ఇంకా చెప్పాలంటే.అప్పుడప్పుడు పొగుడుతూనే వున్నాడు. ఏది ఏమైనా ఆమె తనకాళ్ళ దగ్గరికి వచ్చి తల్లిని కావడం కంటే మీరే నాకు ముఖ్యం, అని వాపోతే తప్ప తను దిగి రాడు

గాక రాడు. ఇండియన్ రెస్టారెంట్ కి వెళ్ళి భోజనం చేసి రావాలి ఈ పూట అనుకుని బట్టలు తీసుకుని లాండ్రీ బాస్కెట్ లో వేసి బేస్-మెంట్ లో వున్న లాండ్రీకి బయలు దేరాడు.

***

తేజల్, గిరిధర్ లు గత ఏడాదిగా చిన్న చిన్న గొడవలు పడుతూలేస్తూ వున్నారు. ఆఖరికి అది చిలికి చిలికి గాలి వాన అయినట్లు నెల రోజుల క్రితం పెద్దగా గొడవ పడ్డారు. దాని ఫలితమే వారిద్దరూ విడిపోవటం వరకూ వెళ్ళింది. తేజల్ కి మాతృత్వం మీద మమకారం రోజు రోజుకీ ద్విగుణీ కృత మవుతోంది. ఆమె కోరిక హెచ్చయ్యే కొద్దీ అతను అగ్గిమీద గుగ్గిలమే అవుతున్నాడు. పిల్లలు అనే పలుకు పూర్తిగా ఆమె నోటినుండి రాక ముందే రౌద్రం తో రెచ్చి పోతాడు. అత్తమీద కోపం దుత్తమీద చూపించే విధంగా పెళ్ళాం మీద కోపం స్టీలు గిన్నెల మీదా గ్లాసుల మీదా చూపించే వాడు. తేజల్ మొగుడి మీద కోపం కప్పులూ సాసర్ల మీదా, గాజు గ్లాసులమీదా చూపెట్టేది. వాళ్ళ సంసారంలో కాఫీ కప్పులకూ గాజుగ్లాసులకూ కాలం చెల్లిపోయింది. సొట్ట పడని స్టీలు గ్లాసులూ, గిన్నెలూ అస్సలు మిగలలేదంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఆ మధ్య ఇద్దరూ విడి విడిగా చెరో కాఫీ మగ్ కొని తెచ్చుకున్నారు. గిరిధర్ లో పురుషాహంకారం బుసలు కొట్టింది.

"నీకూ నాకూ కుదరటం లేదు. ఈ ఇంట్లో నువ్వో- నేనో ఎవరో ఒకళ్లమే వుండాలి. నువ్వూ, నీ అలవాట్లు నాకు చిరాగ్గా వుంటున్నాయి", బల్లగుద్ది, గొంతుపెంచి, ముఖంలో అతి కాఠిన్యాన్ని ప్రదర్శిస్తూ, సోఫాలో కూర్చున్నవాడు లేచి ఆమె మీద మీదకి రాసాగాడు. ఆమె అతన్ని వెనక్కు ఒక్క తోపు తోసింది. అతను పడిపోయాడు. కానీ చెప్పుకోతగిన దెబ్బలేమీ తగల్లేదు. మళ్ళీ ఆమె మీదకి చెయ్యెత్తి బోయాడు. ఈ సారి ఆమె కూడా చెయ్యెత్తింది. "మర్యాదగామసలటం నేర్చుకోండి" చెప్పింది. అతను కొంచెంగా జంకాడు. అడుగు వెనక్కి వేసాడు. "చూడండీ, ఈ అపార్ట్ మెంట్ నా స్వంతం. నా కష్టార్జితంతో డౌన్ పేమెంట్ కట్టి కొనుక్కున్నాను. ఈ రోజుకీ మార్ట్ గేజ్ నేనే కడుతున్నాను. అసలీ ఇంట్లో నుండి నేనెందు కెళ్ళాలి? అసలా మాట అనే హక్కు మీకు లేనేలేదు. తమరి సంపాదన తమరి ఖర్చులకే చాలదాయే! ఇక్కడ వుండటం ఇష్టం లేక పోతే తమరే హాయిగా వెళ్ళ వచ్చు".

"ఎంత పొగరే నీకు! బలిసిన వాగుడు"

"ఏం తమరికి తక్కువా ?"

"నిన్ను కాదే ... నిన్ను కన్న మీ అమ్మననాలి. "

"మా అమ్మ కెందుకు లేండి అంత గౌరవం! అదేదో మీ అమ్మకే ఇవ్వండి"

"ఏం కూశావే!"

"ఆ మాటే, నేనంటే కూతలు, తమరంటే బంగారు పలుకులూనా? నడవండి ముందు బయటికి" అతని బట్టలూ - పెట్టే విసిరిపడేసింది తేజల్. "పిల్లలు వద్దన్నందుకు ఇంత రాద్ధాంతం చేస్తావా? పెళ్ళికి ముందే చెప్పేను గదే నీకు! అప్పుడు సరేనన్నావుగా!"

"మీరు చెప్పలేదని నేనన్నానా? అప్పుడు సరే అంటే.ఇప్పుడు తల్లిని కావాలనీ, మాతృత్వపు ఆనందాన్ని అనుభవించి ఆనందించాలనీ బలంగా అనిపించకూడదా ! మీకు తండ్రి కావాలని లేనంత మాత్రాన నాకు తల్లిని కావాలనే ఆశ వుండదా? నా ఆశను మీకు గత రెండేళ్ళుగా నయానా భయానా చెబుతూనే వున్నా చిలక్కు చెప్పినట్లు", రెట్టించింది తేజల్.

"నేనూ చెబుతూనే వున్నా పిల్లలొద్దూవద్దు అని హంసకు చెప్పినట్లు. "ఇప్పుడంత నోరు పారేసుకుంటున్నావు, నువ్వే గ్రహిస్తావ్ కొంత కాలానికి. భర్త అంటే ఎంత గొప్పవాడో!

"అదే నేనూ అనుకుంటున్నాను. మీరే నా కాళ్ళ దగ్గరి కొస్తారు!!

"చూద్దాంగా ఎవరు ఎవరి కాళ్ళ బేరానికి వస్తారో!" చాలెంజి చేసాడు గిరిధర్.

"తప్పకుండా" – రెచ్చగొట్టింది తేజల్. మళ్ళీ తనే "నేనేమి పంతొమ్మిదివందల నలభైలోనో,యాభైలోనో పుట్టి, చదువూ-సంధ్యా లేక అమాయకంగా మిమ్మల్ని పెళ్ళాడి మీ పాదాల చెంత ఇంత చోటిస్తే చాలు" అని ప్రాధేయపడే బాపతు స్త్రీ ననుకున్నరేమో! ఆ పప్పులన్నీ నా దగ్గరుడకవు. మీ జీతం కంటే నా సంపాదనే ఎక్కువని మరొకసారి తమరికి గుర్తు చేయాలా! ఆరు నెలలు మీరు ఒంటరిగా వుండి చూడండి మీరు మిస్సవుతున్నదేమిటో! పోగొట్టుకుంటున్నదేమిటో తప్పక గ్రహిస్తారు"

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందనే సామెత నాకు బాగా వర్తిస్తుంది.హు" గొణిగాడు గిరిధర్. "అందుకే మరి చించు

కోకుండా నడవండి బయటికి. నాకు నిద్రొస్తోందిగుడ్ నైట్” అంటూ గిరిధర్ ని రోడ్డుమీదకి నెట్టేసింది తేజల్.

***

కాల చక్రం వడిగా వాడిగా పరుగులు తీస్తూనే వుంది. అయితే కాల గమనాన్ని, వేగాన్ని ఎవరికి వారు వారి జీవన సరళిని, పరిస్థితులనూ బేరీజు వేసుకుంటూ అన్వయించుకుంటారు.కొందరికి అతిత్వరగా పరిగెడుతున్నట్లు కొందరికి నత్త నడకలు నడుస్తున్నట్లు ఇంకా మరికొందరికి స్తంభించినట్లు ఎవరి అనుభూతి వారిది. గిరిధర్ కి కాలం మెల్లగా అతిమెల్లగా అడుగులు వేస్తున్నట్లుంటే తేజల్ కి మనోవేగం కంటే కూడా మరీ హెచ్చువేగంగా అనిపించింది. “ఏమన్నా కావాలా?” అని తేజల్ అడిగినప్పుడు “వంకాయకూర కావాలి ” అనాలనిపించేది గిరిధర్ కి. కానీ “నేను మగాణ్ణి” అనే అహం అడ్డొచ్చేసేది. తేజల్ కి గిరిధర్ వెళ్ళాక పని తగ్గింది. గిరిధర్ వున్నప్పుడు ప్రతి రోజు అన్నం, కూరా, చారు, పచ్చడి, అప్పడాలు, పెరుగు అన్నీ యధావిధిగా చేయవలసి వచ్చేది. ఆమె సోమవారం నుండి శుక్రవారం వరకూ పాస్టా, పిజ్జా, శాలడ్, సాండ్ విచ్, చపాతీ వంటి పదార్థాలతో గడిపేస్తోంది. శని ఆది వారాలు మాత్రం, ఒక రోజు అన్నం, పప్పూ, కూరా, ఇంకో రోజు ఇడ్లీ కానీ దోసె కానీ చేసుకుని, హాయిగా విశ్రాంతిగా తనకు నచ్చినట్లు పోరూ-పొక్కూ లేకుండా కాలక్షేపం చేయడమే కాక అవకాశమున్నప్పుడు దగ్గరలో వున్న హిందూ దేవాలయానికి వెళ్ళి వాలంటరీ వర్క్ చేయడం ప్రారంభించింది. ఆమె కెనడీయన్ ఇంపీరియల్ బ్యాంక్ లో జాబ్ చేస్తోంది. గిరిధర్ ఒక పబ్లిషింగ్ కంపెనీ లో పని చేస్తున్నాడు. సంవత్సరం గిర్రున సినిమా రీలులా తిరిగిపోయింది. గిరిధర్ వంట బాగా నేర్చుకున్నాడు. ఈ మధ్య కాలంలో గిరిధర్ తేజల్ ల మధ్య రాక పోకలు ఏమీ జరగలేదు. తేజల్ గిరిధర్ క్షేమం తెలుసుకోవటం, ఫోన్ చేయటం క్రమేపి విరమించుకుంది. గిరిధర్ తన మాదిరిగానే వంటరిగా వుంటున్న మగవాళ్ళను పిలిచి డిన్నర్ పార్టీలు, మందు పార్టీలూ మొదలు పెట్టాడు. అతని తల్లికి జబ్బు తిరగ పెట్టటంతో ఇండియాకి డబ్బు మామూలు కంటే ఎక్కువ మొత్తం పంపవలసి వచ్చింది. టెన్షన్ అధికమైంది.ఆఫీసులో పని సమంగా చెయ్యటం లేదని మేనేజర్ గట్టి వార్నింగ్ ఇవ్వటం కూడా జరిగింది.

***

కాలం మరొక సంవత్సరం ముందుకు జరిగింది. అది మార్చి నెల రెండువేల పదమూడు, గురువారం. మంచు పర్వతాలు చాలా వరకూ కరిగిపోయి, అక్కడక్కడా ఇండియా, సౌత్ అమెరికా, నార్త్ అమెరికా మ్యాప్ ల ఆకృతిలో మంచు పరుచుకుని వుంది. ట్యూలిప్స్, డేఫడేల్స్ అప్పుడప్పుడే విచ్చుకుంటున్నాయి. తేజల్ గిరిధర్ లకు విడాకులు మంజూరయ్యాయి. వారిద్దరి ముఖ కవళికల్లోనూ ఏ విధమైన భావంగోచరించ లేదు. కానీ ఇద్దరూ కలిసి కోర్టు హాలు నుండి పార్కింగ్ లాట్ దాకా కలిసి నడిచారు. ముందుగా తేజల్ తనే మాట్లాడింది. “మీకు ఎప్పుడైనా అవసరం వస్తే నా ఇంట్లో వుండవచ్చు. కేవలం సాటి మనిషిగా మాత్రమే. ఎటువంటి సందర్భంలోనూ నా మాజీభర్త నని జ్ఞప్తికి తెచ్చుకోకూడదు. ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోవాలి. మీరు ఉద్యోగాన్వేషణలో వున్నట్లు నాకర్థం అయింది. ఉద్యోగంలో అశ్రద్ధ చేయకూడదని ఒకరు చెప్పనక్కరలేదు. నేను నా గత జీవితపు జ్ఞాపకాలను పూర్తిగా చెరిపేసాను. మన పెళ్ళి ఫోటోలు, బట్టలూ వగైరా అన్నీ చెత్త కుండీలో పారేశాను. ఆ వస్తు సామాగ్రీ అంతా నా మీద గాలికి ఎగిరి పడిన నిప్పురవ్వలనుకుని, వాటిని నా సాయశక్తులా ప్రయత్నించి వెంటనే దులిపేసుకున్నాను. ఇల్లుకూడా మారాను. ఆ అపార్ట్ మెంట్ అద్దెకిచ్చేసాను. అంటే నేను మళ్ళీ “వివాహం” చేసుకోబోతున్నాను. వచ్చే నెల పదవ తేదీన. నిజం దాచే ఉద్దేశ్యం లేదు కనుక చెబుతున్నాను. గత ఐదు నెలలుగా వసంత రావు గారితో “సహజీవనం” చేస్తున్నాను. ఆయనకూ పిల్లలంటే విపరీతమైన ఇష్టం, ప్రేమ. ఇప్పుడు నేను మూడు నెలల గర్భవతిని. ఆయనకిది మొదటి పెళ్ళే. చాలా సహృదయులు. నీకు ఏదైనా ఇబ్బంది కలిగితే కనుక మన ఇంట్లో వచ్చి వుండవచ్చని మీకు చెప్పమని ఆయనే చెప్పమన్నారు. బేబీ పుట్టాక నేను ఉద్యోగం కూడా చేయనక్కర లేదని చెప్పారు. కానీ నేను మానదల్చుకోలేదు. ఆడా మగా అనే విచక్షణ లేకుండా ఏ వ్యక్తి కైనా ఉద్యోగం అవసరం. బై” అంటూ వెనక్కి తిరిగి చూడకుండానే వెళ్లి పోతూ అంది. అంతలోనే ఆగి “అన్నట్లు మరొక విషయం ఏమంటే ఆయనకు నా గత జీవితం క్షుణ్ణంగా తెలుసు. మంచి అవగాహన వున్న మనిషి. మీతో కాపురం వెలగబెట్టినప్పటి కంటే కోటి రెట్లు ఆనందం

"గా వున్నాను." అంటూ తన కారు దగ్గరికి నడిచింది. "బై" అన్నాడు కానీ గిరిధర్ హృదయం రోషంతో భగ్గుమంది. తనను బ్రతిమాలి, కాళ్ళవేళ్ళా పడినంత పని చేసి ఇంటికి తీసుకు వెళ్తుందని ఆశల అలల్లో తేలిపోయిన అతని మనసు తేజల్ మాటలూ, ప్రవర్తనా పుండు మీద కారం చల్లినట్లయి, చేసేదేమిలేక తన కారు దగ్గరకు అశాంతిగా నడిచా డు. కారు డ్రైవ్ చేస్తున్నా అతని ఆలోచనలు మాత్రం తేజల్ ని వదిలి పెట్టటం లేదు. తనే ఆమెకు క్షమాపణ చెప్తే వ్యవహారం ఇంత వరకూ వచ్చేది కాదేమో. "తను తప్పు చేసాడా? అహంకారంతో తన జీవితాన్ని తనే నాశనం చేసుకున్నాడా?" ఆలోచనలతో గిరిధర్ మెదడు వేడెక్కిపోయింది. తేజల్ మాటలు, ధైర్యం,కన్నీళ్లు కార్చని ఆమె మనో నిబ్బరం, అతని అహంకారాన్ని వెక్కిరిస్తూ సవాల్ చేస్తున్నట్లనిపించింది.

## సాహిత్య భారతి

### మన పాట – మన మాట – మన పద్యం



సాహిత్య భారతి
(న్యూజెర్సీ)

డిసెంబరు 2009 లో ప్రారంభమయిన సాహితీ సమూహం ఈ నాటికి ఒక సంస్థగా రూపుదిద్దుకుంటోంది. శ్రీమతులు కాశీనాధుని రాధ, భావరాజు భారతి మరియు వైదేహి శశిధర్ మార్గ దర్శనం, సంచాలకత్వంలో ప్రతీ సంవత్సరం కనీసం ఆరు సాహితీ సమావేశాలు జరుపుకుంటూ న్యూ జెర్సీ సాహిత్యాభిమానుల్ని ఒక దగ్గరకు కలుపుతోంది.

ఈ సంస్థ ముఖ్యోద్దేశం న్యూజెర్సీ లో ఉన్న సాహిత్యాభిమానులు అప్పుడప్పుడు ఒక చోట కలుసుకోవడానికి అవకాశం కల్పించడం, సాహిత్యానికి సంబంధించిన నాలుగు మంచి మాటలు చెప్పుకోవడం, వినడము, ఇండియానుంచి వచ్చిన వక్తలకు, రచయితలకు, కవులకు న్యూజెర్సీలో ఒకవేదికగా ఉండడము. సన్మానాలు, పారితోషకాలు మొదలైన వాటికి దూరం గా ఉండి, ఒకరినొకరు గౌరవించుకోవడమే 'సన్మానం' అనే నమ్మకాన్ని అందరిలో కలిగించడం. మన పాట–మన మాట–మన పద్యం పట్ల తెలుగు వారిలో ఉత్సుకత రేకిత్తించడం.

ఈ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 28వ తేదీన మధ్యాహ్నం బ్రిడ్జి వాటర్ బాలాజీ టెంపుల్ లాంగ్వేజీ క్లాస్ రూమ్-లో సాహితీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. వైదేహీ శశిధర్ కవితా సంకలనం 'పునశ్చరణం' పుస్తకావిష్కరణ జరిగింది. తెలుగు జ్యోతి భూతపూర్వ సంపాదకులు డా. భావరాజు పరబ్రహ్మ మూర్తి గారు పుస్తకావిష్కరణ చేసారు. పునశ్చరణం గురించి ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు శ్రీవేంకటయోగి నారాయణస్వామి గారి ఉపన్యాసం, అనంతరం సంస్కృతకవి **భవభూతి'** గురించి శ్రీ కొంపెల్ల భాస్కర్ గారి ప్రసంగం జరిగాయి. సాహితీ కార్యక్రమానతరం బొండాలు, పులిహోర వగైరా రుచికరమైన వంటకాలతో "మినీ విందు" జరిగింది. ఈ కార్యక్రమానికి అనేకమంది సాహితీ అభిమానులు హాజరయి డా. వైదేహీ శశిధర్ ను అభినందించారు.

## పునశ్చరణం – సమీక్ష

**శ్రీ తమ్మినేని యదుకుల భూషణ్**

వైదేహి రెండవ కవితా సంకలనం ' పునశ్చరణం ' లో నన్ను ఆకట్టుకున్న వాక్యాలు:

*"తులసి మొక్క చుట్టూ తెరల్లా కమ్ముకునే చీకటి అంచుల్ని*
*రెపరెప లాడిస్తూ అరటి దొన్నెల్లో నీవు వెలిగించిన కార్తీక దీపాలు*
*కొండెక్క కుండా నా కంటితడి ముప్పై మూడేళ్ళుగా*
*కాపాడుతూనే ఉంది "* (నాయనమ్మ)

కాబట్టే కవయిత్రి ఇవాళ 'పునశ్చరణం' చేయగలుగుతుంది.

*రాయడం పూర్తి చేసిన కవితను*
*మళ్ళీ మళ్ళీ చదువుతుంటాను*
*అప్పుడే పుట్టిన పసికందును*
*ఒక్క క్షణం కూడా వదలలేక*
*తడిమి తడిమి ముద్దాడే తొలి చూలాలిలా"*

మంత్రధూళిలో మాటలు కవిత్వంగా మారే క్షణాలు కవయిత్రికి తెలుసు:

*"మనం రోజూ మాట్లాడుకుంటూనే ఉంటాం*
*ఎప్పుడో ఒక్క క్షణంలో మాత్రం*
*చందన పుష్పాల్లా*
*మాటలు మన మధ్య కొత్తగా గుబాళిస్తాయి"*

బరువైన భావాలను అలతి అలతి పదాలతో, కొలది మాటలతో పలికించడం ఒక పద్ధతి. తద్భిన్నంగా బరువైన పదాలతో వివరంగా, విశదంగా చెప్పడం మరొక పద్ధతి. వైదేహి రెండవ మార్గాన్ని అనుసరించినట్టు అగుపించినా, మొదటి పద్ధతిలో రాసిన కవితలు తక్కువ కాదు. ఇంట్లో ప్రతిమూలనీ వెలిగించే ఎండ కవిత్వంలో ఎలా ప్రసరిస్తుందో గమనించి ఎన్నో విషయాలు చెప్పవచ్చు. కవయిత్రికి ఎండ 'చేయి వదలని చిరకాలపు సహచరి'. వెలుతురుతో అంతరంగాన్ని ముడిపెట్టుకున్న కవయిత్రి లో మారే ఎండతో కలిగే భావాలు:

"బంగారం నీడల సాయంకాలం రాగానే సిగలా ముడిచి పెట్టిన ఆలోచనల జలపాతాలను స్వేచ్ఛగా వదిలేస్తాను"

ఆకాశంతో మమేకమై, గడిచిన సాయంకాలాల మెరుపు కళ్ళలో వెలిగిపోతేగాని అంతరంగంలో అసలైన కవిత్వం ఉద్భవించదు.

"ఏటి మీదకు జారిన ఎర్ర గన్నేరు పువ్వుల్లాంటి అందమైన ఆ రోజుల్ని మళ్ళీ ఒడిసి పట్టుకోవాలని కాలపు ఒడ్డు మీంచి జ్ఞాపకాల వలలని వృధాగా విసురుతాం"

కాబట్టి "నాలాగే కాంతులతో హృదయాన్ని పారేసుకున్న నీలాకాశం" అని కవయిత్రి భావించడం సహజమే!!


## డా. వైదేహి శశిధర్ కవితలు – "పునశ్చరణం" కవితా సంపుటి నుండి

### "పునశ్చరణం"

రాయటం పూర్తి చేసిన
కవితను మళ్ళీ మళ్ళీ
చదువుతూ ఉంటాను
    అప్పుడే పుట్టిన పసికందును
    ఒక్క క్షణం కూడా వదలలేక
    తడిమి తడిమి ముద్దాడే
    తొలిచూలాలిలా
పరాయి దేశం లో
హఠాత్తుగా ఎదురైన
చిన్ననాటి నేస్తాన్ని
తరచి తరచి
పరామర్శించే స్నేహితునిలా
    పరిష్వంగాన్ని సడలించిన
    మరుక్షణం లోనే పేయేళ్ళ
    విరహాన్ని అనుభవిస్తూ
    పదే పదే కౌగలించే ప్రేమికునిలా

### "తేనీటి సమయం"

వారమంతా వారాంతం కోసం వోపిగ్గా ఎదురు చూశాక
ఎప్పటిలానే ఏలకుల సుగంధాన్ని మోసుకుని
శనివారపు ఉదయం మెత్తగా నిద్ర లేపుతుంది
    మూల కుండీలో ఎర్రటి మొక్క
    నిద్ర కళ్ళతో బద్ధకంగా పలకరిస్తుంది
    అద్దాల గదిలో గుండ్రటి గాజు బల్ల
    వేడి కప్పుల చురుకు స్పర్శకు నిమ్మళంగా నవ్వుతుంది
చెట్టు కొమ్మపై చెవులు రిక్కించిన ఫించ్ పిట్ట,
విచ్చిన మొగ్గలతో మాగన్ను రెమ్మల మాగ్నోలియా,
రవ్వంతైనా సవ్వడి చేయని నిటారు పైన్ చెట్లు,
సమావేశానికి హాజరైన బోర్డు మెంబర్స్‌లా నిలబడ్డాయి
    పొగలు కక్కుతున్న తేనీటినీ,
    సంభాషణలతో పనిలేని సాన్నిహిత్యాన్నీ,
    తీరికగా ఆస్వాదిస్తూ రాజ్యాధినేతల్లా
    ఎదురెదురుగా కూర్చుంటాం నువ్వూ, నేను!
    గలగల పారే ఏరులా కాలం జారిపోతుంది.


ASLC
ALL STATE LENDERS CORP
LICENSED CORRESPONDENT MORTGAGE LENDER - FL, NJ DOBI
$0* CLOSING
COST REFINANCE
*For qualified borrowers only.
ALL STATE LENDERS CORP.
LICENSED CORRESPONDENT MORTGAGE LENDER - FL, NJ DOBI
2088 US Hwy 130,
Monmouth Jct., NJ 08852
Ph.: 732-951-0333 Fax. 732-951-0311
www.MeriMortgage.com

**Telugu Fine Arts Society (TFAS)**
**c/o Vamsi Koppuravuri**
**1 Newburgh Drive, Edison, NJ - 08820**

PRSRT STD
US Postage PAID
Permit #6
New Brunswick, NJ

**Return Service Requested**

*************************************************************************************************************

# IN MEMORY OF SHANTHI SRIKONDA

## DECEMBER 27, 1941 - JUNE 11, 2001

I finally found the courage to go back home without you
During the long trip I was not sure how it will work out
Memories of our travels together and the time spent every trip kept coming back
I stopped at every place we spent our lives together and noticed that none existed
Went to all our meeting places, your high school and medical college you graduated
Recollecting all the good times we spent in the Public Gardens and the movies we saw
The happy and wonderful times we had and how we faced all the fears and anxiety
Thank you for being a wonderful companion for 55 years of our lives.

I am so grateful to all of our friends, past and the present
For all the help, support and kindness and wonder how I can ever repay them.
I do remember you always made sure to never visit any one's home empty handed
To take whatever we have no matter how small it is like, a flower or a fruit
These are the things that I remember why I fell in love with you
I promise to continue all these traditions you valued so much
And hope to pass them on to our children and grand children.





**Your childhood sweetheart**

**And always loving husband, Satya**

**Shashi,Vijaya and Shanivi**
**Sanjay & Nalin**
**Susheel, Susan, Raina and Vikram**

**June 11, 2014**

*Shanthi Travel, Inc.*
Ph. 973-423-4444; Shanthitravel_99@yahoo.com